ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

గుంటూరు జిల్లా వార్తలు



5

శనివారం 6 సెప్టెంబరు 2025



తురకపాలెంలో మహిళలతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే రామాంజనేయులు



◆ తురకపాలెంలో పర్యటిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యే రామాంజనేయులు

తురకపాలెంలో కొనసాగుతున్న వైద్య శిబిరం

అంతు చిక్కని మరణాలపై పరీక్షలు

- నివేదికల తర్వాతే జ్వరాలపై స్పష్టత ఇస్తామన్న నేతలు
- గ్రామంలో పర్యటించి బాధితులను పరామర్శించిన కేంద్ర, రాష్ట్ర మంత్రులు
- తురకపాలెం మరణాలపై సీఎం చంద్రబాబు అత్యవసర సమీక్ష

గుంటూరు మెడికల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన గుంటూరు రూరల్ మండలం తురకపాలెం గ్రామంలో అంతు చిక్కని వరుస మరణాలపై వైద్య పరీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం కూడా గ్రామంలో పలువురి నుంచి రక్తనమూనాలు సేకరించి వివిధ పరీక్షలకు పంపారు. రక్తనమూనాల పరీక్ష ఫలితాల కోసం అందరూ ఎదురు చూస్తున్నారు. ఈ పరీక్ష ఫలితాలతో.. మరణాలకు కారణమైన సూక్ష్మజీవిని నిగ్గు తేల్చేందుకు వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు సైతం వేచి ఉన్నారు. గ్రామానికి చెందిన 44 మంది జ్వర బాధితుల నుంచి సేకరించిన రక్తనమూనాలకు గుంటూరు వైద్య కళాశాల మైక్రోబయాలజీ ల్యాబోరేటరీలో పరీక్షించగా 9 బ్యాక్టీరియా పాజిటివ్‌గా నివేదికలు వచ్చినట్లు తెలిసింది. కాగా గ్రామానికి చెందిన పీ నరసింహరావు (40) జ్వరం, కీళ్ల నొప్పులు, దగ్గు, ఆయాసంతో బాధపడుతూ ప్రైవేటు వైద్యశాలలో చేరగా అతడ్ని పరీక్షించగా మెలియాయిడోసిస్ పాజిటివ్ తేల్చారు. ప్రస్తుతం గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న తురకపాలెం గ్రామానికి చెందిన ఇద్దరి ఆరోగ్యం నిలకడగా ఉందని సూపరింటెండెంట్ డాక్టర్ రమణ తెలిపారు. గుంటూరు రూరల్ మండలం తురకపాలెంలో ప్రబలిన అంతు చిక్కని జ్వరాల నేపథ్యంలో గ్రామంలో హెల్త్ ఎమర్జెన్సీగా భావించి విధులు నిర్వహించాలని ముఖ్య మంత్రి చంద్రబాబు ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తదితరులు గ్రామంలో పర్యటించారు. అనంతరం స్థానిక ప్రజలతో మాట్లాడి (మిగతా 8వ పేజీలో)

పడిపోయిన పరపతి



60 ఏళ్ల చరిత్రలో అథమ స్థానం

- ఎన్జీ రంగా వర్సిటీకి 31వ ర్యాంకు
- వైసీపీ పాలకుల పాపం.. యూనివర్సిటీకి శాపం

(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి)

ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరపతి జాతీయ స్థాయిలో పతనావస్థకు చేరింది. వర్సిటీ 60 ఏళ్ల చరిత్రలో ఎన్నో నూతన ఆవిష్కరణలతో అగ్రస్థానంలో నిలిచి ప్రస్తుతం అథః పాతాళానికి చేరింది. తాజాగా విడుదలైన నేషనల్ ఇనిస్ట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్ -2025లో 31వ ర్యాంకుకు పడిపోయింది. రెండేళ్లుగా జాతీయ స్థాయిలో యూనివర్సిటీ ర్యాంకు వరుసగా పడిపోతూనే ఉంది. 2023లో ఎన్ఐఆర్ఎఫ్ సర్వేలో వర్సిటీ 20వ ర్యాంకును, 2024లో 26వ ర్యాంకు సాధించింది. ఈ సంవత్సరం ర్యాంకు మరింత దిగజారింది. జాతీయ స్థాయిలోని వ్యవసాయ అనుబంధ యూనివర్సిటీల్లో అనేక అంశాలను పరిశీలించి మార్కులు కేటాయిస్తారు. ఆ లెక్కన ఈ ఏడాది ఎన్జీ రంగా యూనివర్సిటీకి 100 మార్కులకు కేవలం 49 మార్కులు మాత్రమే దక్కాయి. కీలకమైన అంశాల్లో బాగా వెనుకబడినట్లు ఎన్ఐఆర్ఎఫ్ నివేదిక స్పష్టం చేస్తోంది.

ర్యాంకులే కీలకం..

దేశంలోని అన్ని విశ్వ విద్యాలయాల పనితీరు, అభివృద్ధికి ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకులు గీటురాళ్ల వంటివి. వీటి ఆధారంగానే అడ్మిషన్లు, నిధులు, ప్రాజెక్టుల కేటాయింపు ఉంటుంది. ర్యాంకులో వెనకబడితే నిధులు ఇవ్వడానికి యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ కూడా ఆసక్తి చూపదు. వర్సిటీ దీర్ఘకాలిక ప్రయోజనాలకు ప్రస్తుతం సాధించిన ర్యాంకు గొడ్డలి పెట్టువంటిదని వర్సిటీ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ పరిస్థితులో రెండేళ్లగా పెద్ద గా పరిశోధనలకు పెద్దపీట పడలేదన్న ఆరోపణలు విని పిస్తున్నాయి. వర్సిటీలో కొత్త పరిశోధనలు జరగలేదని వాస్తవం వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులకు పూర్తిగా తెలుసు. ఈ పరిస్థితుల్లో (మిగతా 8వ పేజీలో)

అన్నీ అటువంటి ఆదేశాలే..

జగన్ ప్రభుత్వంలో నియమితులైన ఇన్‌చార్జి వీసీ నిర్ణయాలు అన్నీ తీవ్ర వివాదాలకు కారణమవుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వస్తున్న రూ.కోట్ల నిధులను పరిశోధనలకు సంబంధించిన ప్రాజెక్టులకు కేటాయించకుండా, కేవలం తిరుపతికి మాత్రమే కేటాయించి దుర్వినియోగపరుస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఆర్థిక కమిటీ లేకుండానే నిధులు కేటాయించడం వంటి వ్యవహారాలు కూడా వివాదాలకు కారణమవుతున్నాయి.

ఎరువులు ఏమవుతున్నాయ్



ఇప్పటి వరకు గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో 18 వేల నుంచి 20 వేల టన్నుల యూరియా సొసైటీల్లో పంపిణీ జరిగినట్లు మార్క్‌ఫెడ్ చెబుతోంది. కానీ ఇందుకు సంబంధించి ఏయే సొసైటీల్లో ఎంతమంది రైతులకు ఇచ్చారనే లెక్కలు కొరవడ్డాయి.

ఇటీవల వరకు వర్షాభావ పరిస్థితుల్లో సాగు సాగ లేదు. ఇటీవల వర్షాలకు వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. అయితే సాగు పనుల్లో నిమగ్నమవ్వాల్సిన రైతులు ఎరువులు కోసం ఎగబడుతున్నారు. అధికారులు పుష్కలంగా యూరియా నిల్వలు ఉంటున్నాయి అంటున్నారు. అయితే ఎక్కడికక్కడ యూరియా అందక రైతులు అల్లాడు తున్నారు. వంద బస్తాలు వచ్చాయంటే పదింతలుగా రైతులు పోటెత్తు తున్నారు. గంటల తరబడి క్యూలో నిరీక్షించినా ఒక్క బస్తా కూడా దొరకడంలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో అధికారిక లెక్కల ప్రకారం పంపిణీ చేసిన యూరియా, ఉన్న నిల్వలకు సాగు అయిన విస్తీర్ణానానికి పొంతనే లేదు. అయితే వచ్చిన యూరియా ఏమైంది.. ఎటు పోయింది.. అనేది తెలియడం లేదు. అధికారులు ఎక్కడి కక్కడ నిఘా, తనిఖీలు, టాస్క్‌ఫోర్సు బృందాలు ఏర్పాటు చేసినా ఎరువులు ఏమయ్యాయో ఎక్కడ ఉన్నాయో తెలుసుకోలేక పోతున్నారు. రైతులు మాత్రం యూరియా దొరక్క పాలుపోని పరిస్థితుల్లో చిక్కుకున్నారు.

యూరియా కోసం ఎగబడుతున్న రైతులు

- సాగు విస్తీర్ణం అంతంతే..
- విపరీతంగా డిమాండ్
- ప్రభుత్వ ప్రకటనలకు.. పొంతనలేని క్షేత్రస్థాయి పరిస్థితులు

(నరసరావుపేట, దాచేపల్లి, బాపట్ల, రేపల్లె - ఆంధ్రజ్యోతి)

దాదాపు రెండు వారాలుగా అన్నదాతల యూరియా ఇక్కట్లపై చర్చ జరుగుతూనే ఉంది. సొసైటీలు, రైతు సేవా కేంద్రాల వద్ద క్యూల్లో రైతులు కనిపిస్తున్నారు. యూరియా సమృద్ధిగా ఉందని అధికారులు ప్రకటనలు చేస్తున్నా.. క్షేత్రస్థాయిలో సమస్య పరిష్కారం అయిన దాఖలాలు కనిపించడం లేదు. వరి పైరు ముంపు బారిన పడడం వల్ల రైతులు వెంటవెంటనే యూరియా చల్లాల్సి వచ్చిందని అందుకు తాత్కాలికంగా సమస్య తలెత్తిందని పది రోజుల క్రితం (మిగతా 8వ పేజీలో)



రేపల్లె : నల్లూరుపాలెంలో ఎరువుల కోసం స్లిప్‌లు రాయించుకుంటున్న రైతులు

అక్రమ రవాణాపై నిఘా



పొందుగల వద్ద కలెక్టర్, ఎస్పీ అర్ధరాత్రి తనిఖీలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పల్నాడు జిల్లా సరిహద్దుల నుంచి తెలంగాణకు అక్రమంగా యూరియా రవాణా అవుతున్న నేపథ్యంలో అధికారులు దృష్టి సారించారు. సరిహద్దుల్లోని చెక్‌పోస్టుల్లో నిఘా ఏర్పాటు చేశారు. యూరియా విక్రయాలపై కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ కంచి శ్రీనివాసరావు నేరుగా రంగంలోకి దిగారు. ఈ క్రమంలో గురువారం అర్ధరాత్రి వీరిద్దరూ వారి వాహనాల్లో కాకుండా ప్రైవేటు వాహనాల్లో ఆకస్మికంగా తనిఖీలు చేశారు. రాష్ట్ర సరిహద్దులోని పొందుగల చెక్‌పోస్టు వద్ద రాత్రి 10.30 నుంచి అర్ధరాత్రి దాటేవరకు వారు స్వయంగా అన్ని వాహనాల్లోనూ తనిఖీ చేశారు. ఆ తర్వాత దాచేపల్లిలో ఎరువులు నిల్వ చేసిన గోదాముల్లో కూడా సోదాలు చేశారు. శుక్రవారం తెల్లవారు జాము 2.30 గంటల వరకు ఈ తనిఖీలు సాగాయి.

ఆందోళన వద్దు : కలెక్టర్ అరుణ్‌బాబు

యూరియా అక్రమాలపై అధికార యంత్రాంగం కఠినంగా వ్యవహరిస్తోందని కలెక్టర్ అరుణ్‌బాబు స్పష్టం చేశారు. అనవసర ఆందోళనలతో అవసరానికి మించి యూరియా కొనుగోళ్లకు రైతులు దూరంగా ఉండాలని సూచించారు.

ఎరువుల అక్రమాలపై పీడీ యాక్టు :ఎస్పీ శ్రీనివాసరావు

యూరియా అక్రమ నిల్వ చేసినా, అక్రమాలకు పాల్పడినా సంబంధితులపై ఏకా, పీడీ యాక్టు ప్రయోగిస్తామని ఎస్పీ కంచి శ్రీనివాసరావు హెచ్చరించారు. పొందుగల, తంగెడ, నాగార్జున సాగర్ చెక్‌పోస్టుల వద్ద వాహన తనిఖీలను ముమ్మరం చేశామన్నారు.

యూట్యూబ్ చూసి.. చోరీల్లో ఆరితేరాడు
- నెలన్నరలో కార్ల అద్దాలు పగలగొట్టి 18 దొంగతనాలు
- 10 కేసులు నమోదు...నిందితుడు నరసరావుపేట రౌడీషీటర్ బాజీ
- వివరాలు వెల్లడించిన ఎస్పీ సతీష్‌కుమార్

దురంతో ఎక్స్‌ప్రెస్‌కు రెండు స్లీపర్ క్లాస్ బోగీలు

రైలుకు ఎదురెళ్లి.. వ్యక్తి ఆత్మహత్య

2 కేజీల గంజాయి స్వాధీనం
- పోలీసుల అదుపులో ఆరుగురు నిందితులు

6



కూచిపూడి హస్తముద్రతో కూడిన డిజైన్ (ఆప్షన్-1)




కూచిపూడి డాన్స్ బ్రిడ్జి నమూనా (ఆప్షన్-2)

ఏ నమూనా నచ్చింది

- ఐకానిక్ బ్రిడ్జి ఆకృతులకు ఓటింగ్
- ప్రజల ముందు సీఆర్డీఏ నాలుగు డిజైన్లు
- కృష్ణానదిపై అమరావతిలోకి గ్రాండ్ గేట్‌వే
- డిజైన్ ఖరారైతే రూ.2,602 కోట్లతో టెండర్

(ఆంధ్రజ్యోతి, మంగళగిరి)

అత్యద్భుతంగా.. రాజధాని అమరావతిలోకి కృష్ణానదిపై తెలంగాణ రాజధాని హైదరాబాద్ నుంచి గ్రాండ్ గేట్‌వే నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. అమరావతి పరిధిలోని రాయపూడి నుంచి ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం మూలపాడు వరకు కృష్ణానదిపై ఐకానిక్ బ్రిడ్జిని నిర్మించనున్నది. ఈ బ్రిడ్జి డిజైన్‌లకు సంబంధించి నాలుగు నమూనాలను ప్రఖ్యాత ఆర్కిటెక్చర్‌లతో తయారు చేయించి వాటిలో ఏది మెరుగైనదో చెప్పాలంటూ ప్రజల ముందర ఓటింగ్‌కు సీఆర్‌డీఏ శుక్రవారం పెట్టింది. రాయపూడి నుంచి ఇబ్రహీంపట్నం పవిత్రసంగమం వరకు నదిపై 3.2 కిమీల పొడవునా ఐకానిక్ బ్రిడ్జిని రూ.1327 కోట్లతో నిర్మించేందుకు గత టీడీపీ ప్రభుత్వం శంకుస్థాపన చేసింది. అయితే ప్రభుత్వం మారడంతో ఆ ప్రాజెక్టు మూలనపడింది. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఐకానిక్ బ్రిడ్జి (మిగతా 8వ పేజీలో)



అమరావతి లోగో ఏ ఆకృతితో కూడిన బ్రిడ్జి డిజైన్ (ఆప్షన్-3)



కూచిపూడి కపోత ముద్రతో కూడిన నమూనా (ఆప్షన్-4)

గురుదేవోభవ

- ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం
- గురువుల మార్గనిర్దేశమే దిక్సూచి : జడ్పీ చైర్‌పర్సన్

గుంటూరు(విద్య), సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు విధి నిర్వహణలో చూపిన ప్రతిభా పాటవాలను కీర్తిస్తూ.. విద్యార్థులను తీర్చిదిద్దుతోన్న వైనాన్ని విశ్లేషిస్తూ.. హర్ష ధ్వానాల మధ్య సత్కరిస్తూ.. శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో స్థానిక రెవెన్యూ కల్యాణ మండపంలో గురుపూజోత్సవం జరిగింది. ఈ సందర్భంగా జడ్పీచైర్ పర్సన్ కత్తెర హెనీక్రిస్టీనా మాట్లాడుతూ గురువుల మార్గ నిర్దేశంలోనే ఎవరైనా ఏ రంగంలో అయినా అత్యున్నత స్థానాలను అధిరోహిస్తారన్నారు. పిల్లల్ని విద్యావంతులుగా తీర్చిదిద్దే గురువుకు తల్లిదండ్రులు, దేవుడి తర్వాత స్థానం ఇచ్చారంటే ఆయన గొప్పతనం ఏమిటో తెలుసుకోవా లన్నారు. నగర కమిషనరు పులి శ్రీనివాసులు మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో గురువులు కీలక భూమిక పోషిస్తున్నారన్నారు. ప్రకాశం జిల్లాలో కుగ్రామానికి చెందిన తాను ఐఏఎస్ స్థాయికి ఎదగడానికి గురువులే కారణమని వివరించారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే నిరుపేద విద్యార్థులను సమర్థవంతమైన పౌరులుగా తీర్చదిద్దడంలో గురువుల పాత్ర కీలకమైందన్నారు. పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి ప్రసంగిస్తూ విద్యార్థుల్లో జ్ఞాన జ్యోతులు వెలిగించి విజ్ఞానం వైపు నడిపించే సమాజ రూపకర్తలే ఉపాధ్యాయులన్నారు. నేటి ఆధునిక యుగంలో పోటీ పేరుతో జరుగుతున్న పరుగులో విద్యార్థులతో పాటు గురువులు ఒత్తిడికి గురవుతున్నారన్నారు. రాష్ట్ర టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహన్‌కృష్ణ, డీఈవో రేణుక మాట్లాడుతూ గురువు ద్వారానే జీవితంలో ఉన్నతమైన స్థానాలు అధిరోహించడం సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయరు సజీల, డిప్యూటీ డీఈవోలు శాంతకుమారి, ఏసురత్నం, ఉర్దూ డీఐ ఖాసిం, ఎంఈవో ఖుద్దూస్ పాల్గొన్నారు. శైలజారెడ్డి, పావని, నిహారికల నృత్యప్రదర్శన ఆహుతుల్ని ఆకట్టుకుంది.



గురువుల్ని సత్కరిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ క్రిస్టీనా, ఎమ్మెల్సీ ఆలపాటి రాజా, కమిషనరు శ్రీనివాసులు, ఎమ్మెల్యే మాధవి, మన్నవ మోహన కృష్ణ, డిప్యూటీ మేయరు సజీల

తుంగభద్రలో గుర్తుతెలియని యువకుడి మృతదేహం


తేలాడుతున్న మృతదేహం

పొన్నూరుటౌన్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణం నుంచి ప్రవహించే తుంగభద్ర డ్రెయిన్‌లో శుక్రవారం గుర్తుతెలియని యువకుడి మృతదేహాన్ని అర్బన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం తుంగభద్ర డ్రయిన్‌లో గుర్తుతెలియని యువకుడి మృతదేహం ఉందని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు యువకుడి మృతదేహాన్ని గజ ఈతగాళ్ల సాయంతో బయటకు తీసి తీశారు. గుర్తుతెలియని అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి, పలు కోణాల్లో దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని నిడుబ్రోలు ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

ఏ నమూనా నచ్చింది

(5వ పేజీ తరువాయి)

నిర్మాణం తెరపైకి వచ్చింది. రాయపూడి- ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమం వరకు దీనిని నిర్మించాలని అనుకున్నా ప్రభుత్వ ప్రణాళికలు కొంత మారడంతో వాటికి అనుగుణంగా ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణ ప్రాంతాలను కూడా మార్చాల్సివచ్చింది. రాజధాని ప్రణాళికలో ఎన్టీఆర్ జిల్లా మూలపాడు వైపు అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంతోపాటు స్పోర్ట్స్‌సిటీ ప్రాజెక్టులకు అనుగుణంగా ఐకానిక్ బ్రిడ్జిని కొంచెం ఆవలివైపుకు తరలించారు. ఈ నూతన ప్రణాళిక ప్రకారం బ్రిడ్జి ఎన్-13 రోడ్డుకు అనుసంధానంగా మొదలై... నదిపై 5.2 కిమీల పొడవునా సాగి మూలపాడు వద్ద జాతీయరహదారి 65తో కలుస్తుంది. దీనివల్ల హైదరాబాద్ నుంచి అమరావతిలోకి గ్రాండ్ ఎంట్రెన్స్ ఇచ్చినట్టవుతుందని సీఆర్‌డీఏ భావిస్తుంది. ఈ ఐకానిక్ బ్రిడ్జిని సుమారుగా రూ.2,602.46 కోట్లతో నిర్మించాలని ప్రాథమికంగా అంచనా వేసింది. ఈ ఐకానిక్ బ్రిడ్జి డిజైనింగ్‌ను ఖరారు చేసే అంశంలో రాష్ట్ర ప్రజలను భాగస్వాములనుగా చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించారు. సీఎం ఆదేశాలతోనే సీఆర్‌డీఏ అధికారులు తమ వెబ్‌సైట్‌లో నాలుగు రకాల డిజైన్‌లను ప్రజల ఓటింగ్‌కు అనుగుణంగా అందుబాటులో ఉంచారు.

ఆప్షన్ -1 : ఇది కూచిపూడి నృత్యంలో హస్త ముద్రలా ఉండే రేడియేటింగ్ కేబుల్ బ్రిడ్జి.

ఆప్షన్ -2: ఎరుపు, తెలుపు రంగుల్లో జంట పైలాన్లతో మన సంస్కృతికి, అదృష్టానికి చిహ్నంగా స్వస్తిక హస్త భంగిమలో ఉండేలా రూపొందించారు.

ఆప్షన్ -3: దీనిని కూచిపూడి కళకు భిన్నంగా రూపొందించారు. ఈ నిర్మాణంలో అమరావతి లోగోగా హైలెట్ అవుతున్న ఇంగ్లీషు అక్షరం ఏ ఆకృతిని ప్రధానంగా తీసుకున్నారు.

ఆప్షన్ -4: ఇది మళ్లీ కూచిపూడి కళాకృతిని పోలి ఉంది. కూచిపూడి నృత్యంలోని కపోత ముద్రలో చేతులెత్తి అభివాదం చేస్తున్నట్టున్న ఐకానిక్ వంతెనగా దీనిని అభివర్ణించారు.

ఓటింగ్ ఇలా..

ఈ నాలుగింటిలో ప్రజలు తమకు నచ్చిన డిజైన్‌కు ఓటేసే వెసులుబాటును సీఆర్‌డీఏ అధికారులు కల్పించారు. సీఆర్‌డీఏ వెబ్‌సైటును ఓపెన్‌చేసి హోంపేజిలో ఓట్ ఫర్ అమరావతి ఐకానిక్ బ్రిడ్జి డిజైన్ అనే స్క్రోల్‌పై క్లిక్ చేస్తే మరో పేజి ఓపెన్ అవుతుంది. అందులో ఓటరు తన పేరు, ఫోన్ నెంబరును నమోదు చేసి అక్కడ చూపుతున్న నాలుగు డిజైన్లలో ఒకదాన్ని ఎంచుకోవాలి. అనంతరం క్యాప్చా కోడ్ ఎంటర్ చేసి ఓటును నమోదు చేసుకోవచ్చు. ఏ డిజైన్‌కు ఎక్కువ ఓట్లు వచ్చాయో చూసి దానినే ప్రజాదరణ గల డిజైన్‌గా ఖరారుచేస్తారు. ఫైనల్‌గా ఆ మోడల్‌లోనే ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణానికి టెండర్లను పిలుస్తారు.

వైసీపీ హయాంలో సొసైటీ అక్రమాలపై సమగ్ర విచారణ

● ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్


సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

పొన్నూరుటౌన్, సెప్టెంబరు5(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో ప్రాథమిక సహకార సంఘాల్లో జరిగిన అక్రమాలపై రాష్ట్రస్థాయి విచారణ కమిటీని ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ తెలిపారు. పచ్చలతాడిపర్రు ప్రాథమిక వ్యవసాయ పరిమితి సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం శుక్రవారం జరిగింది. సొసైటీ అధ్యక్షుడిగా జనసేన నాయకుడు గంధం సురేంద్ర, సభ్యులుగా పచ్చలతాడిపర్రు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు యంపరాల గోపీకృష్ణ, కట్టెంపూడి గ్రామస్తుడు యక్కటి నాగేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే నరేంద్రకుమార్ మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల కాలంలో దండమూడి గ్రామంలో ఎన్నో రకాల విధ్వంసానికి తెరతీశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో ప్రతిపక్ష నాయకులు వినాయక నిమజ్జనాలను కూడా చేసుకోవడానికి వీల్లేకుండా ఆటంకాలు కలిగించారని దుయ్యబట్టారు. పోలీసులను పెట్టి బెదిరింపులకు పాల్పడి, అక్రమ కేసులు బనాయించి.. వేధింపులకు గురిచేసినా జనసేన, టీడీపీ నాయకులు వాటిని ఎదుర్కొన్నారని ప్రశంసించారు. తేనె పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న గంధం సురేంద్ర ఆర్థిక మూలాల మీద దెబ్బ తీయాలని చూశారని ఆరోపించారు. గత ప్రభుత్వంలో బోగస్ డ్వాక్రా సంఘాలు ఏర్పాటు చేసి, అక్రమ మార్గంలో రుణాలు తీసుకున్నారని విమర్శించారు. సొసైటీల్లో రైతుల పేర్ల మీద రుణాలు తీసుకొని.. కోట్ల రూపాయలు కొల్లగొట్టి అక్రమార్కులను కఠినంగా శిక్షిస్తామని ధూళిపాళ్ల స్పష్టం చేశారు. పచ్చలతాడిపర్రు సొసైటీ అధ్యక్షులుగా ఉన్నవారు ఉన్నత పదవులు చేపట్టారని గుర్తుచేశారు. సొసైటీ పరిధిలోని రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా.. పంట రుణాలు సకాలంలో అందించడంతోపాటు ఎరువులు సరఫరా చేసి వారి మన్ననలు పొందాలని ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ నూతన కార్యవర్గ సభ్యులకు సూచించారు. జనసేన సమన్వయకర్త వడ్రాణం మార్కండేయబాబు మాట్లాడుతూ జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆశయాలకు అనుగుణంగా దండమూడి సొసైటీకి అత్యంత పిన్న వయస్కుడు సురేంద్రను అధ్యక్షుడిగా నియమించడంపై ఎమ్మెల్యే నరేంద్ర కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సురేంద్రకు పదవి రావడంతో కొంతమంది అసంతృప్తి వాదులు అతనిపై అసత్యాలు ప్రచారం చేశారని సురేంద్ర వాటిని రైతు సేవ ద్వారా ఎదుర్కోవాలని సూచించారు. అతిథుల సమక్షంలో ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను, ముఖ్య అతిథులను జనసేన నియోజకవర్గ నాయకులు ఘనంగా సత్కరించారు. కూటమి పార్టీల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

1.0820 ఎంయూల విద్యుదుత్పత్తి

రెంటచింతల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని నాగార్జున సాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు చెందిన 20 రేడియల్ క్రస్ట్ గేట్లకు 3 గేట్లను 1.5 మీటర్లు, ఒక గేట్‌ను మీటర మేర ఎత్తి 25,490 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నారు. విద్యుదుత్పత్తి అనంతరం టేల్ రేస్ చానల్ ద్వారా 8,600.. మొత్తం 34,099 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నట్లు ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈలు సుబ్రహ్మణ్యం, నాగరాజు చెప్పారు. గురువారం అర్ధరాత్రి 12 గంటల వరకు 1.0820 ఎంయూల విద్యుత్ ఉత్పత్తి అయ్యిందన్నారు. రిజర్వాయర్‌లో 75.50 (పూర్తిస్థాయి) మీటర్ల మేర నీరుండగా ఈ నీరు 7.080 (పూర్తి స్థాయి) టీఎంసీలకు సమానమని తెలిపారు.

నాగార్జున సాగర్ నీటి సమాచారం

విజయపురిసౌత్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సాగర్ జలాశయం నీటి మట్టం శుక్రవారం నాటికి 589.00 అడుగులు ఉంది. ఇది 309.05 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9,500, ఎడమ కాలువ ద్వారా 7,029, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 32,886, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2,400, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో 52,115 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి ఇన్‌ఫ్లో 52,115 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

స్వల్పంగా వరద ఉధృతి


స్పిల్ వే ద్వారా నీరు విడుదల

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు5 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల తగ్గించడంతో ప్రకాశం బ్యారేజీ వద్ద వరద ఉధృతి స్వల్పంగా కొనసాగుతోంది. పులిచింతల ప్రాజెక్టుతోపాటు, కీసర, మున్నేరు, వెలగలేరు, తదితర ప్రధాన వాగుల నుంచి 26,298 క్యూసెక్కుల వరద నీరు శుక్రవారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతున్నట్టు ఇరిగేషన్ శాఖ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం నమోదు అవుతుండగా దిగువకు 8,700 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తూర్పు డెల్టా కాల్వకు 10,076, పశ్చిమ డెల్టాకు 8,004, గుంటూరు చానల్‌కు 148 క్యూసెక్కుల నీటి విడుదల చేస్తున్నారు.

యువత భుజస్కంధాలపైనే భారత ఉజ్వల భవిష్యత్తు

● రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్



మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్, చిత్రంలో భాష్యం రామకృష్ణ తదితరులు

గుంటూరు(విద్య), సెప్టెంబరు5(ఆంధ్రజ్యోతి): దేశ ఉజ్వల భవిష్యత్తు యువత భుజస్కంధాలపై ఉందని ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని భాష్యం మెడెక్స్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఏటుకూరు రోడ్డులోని ఓ కల్యాణ మండపంలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. నలంద, తక్షశిల వంటి విశ్వ విద్యాలయాల ద్వారా ప్రపంచ మానవాళికి జ్ఞాన మందించిన ఘనమైన మన భారత సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రాబోవు రోజుల్లో విద్యా వ్యవస్థలో సంస్కరణల ద్వారా పెను మార్పులను ప్రతి ఒక్క విద్యార్థి ఆకళింపు చేసుకుంటూ వికసిత్ భారత్ నిర్మాణానికి కృషి చేయాలన్నారు. ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ పోతినేని రమేష్ బాబు మాట్లాడుతూ జ్ఞానం, నైపుణ్యాలను సరైన మార్గంలో నడిపించే వారే గురువు అన్నారు. జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్ అంకాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నల్లబోతు మురళి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనదని, ఏ వృత్తిలో రాణించాలన్నా.. గురువుల పాత్ర అమూల్యమైనదన్నారు. భాష్యం విద్యా సంస్థల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపేందుకు జీవితంలో ఎంతో సాధించిన.. ప్రేరణాత్మకమైన వ్యక్తులను పరిచయం చేయడం జరుగుతుందన్నారు. వారి అనుభవసారాన్ని వినమ్రంగా గ్రహించి లక్ష్యసాధనకు కృషిచేయాలని విద్యార్థులకు సూచించారు. సభకు భాష్యం మెడెక్స్ ప్రిన్సిపాల్ హరిబాబు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో భాష్యం విద్యా సంస్థల వైస్ చైర్మన్ భాష్యం హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్ తదితరులు పాల్గొన్నారు.

కులగణన చేసిన తర్వాతే స్థానిక ఎన్నికలకు వెళ్లాలి

● బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన


మాట్లాడుతున్న కేసన శంకరరావు

మంగళగిరి సిటీ, సెప్టెంబరు5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కులగణన పూర్తిచేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు డిమాండ్ చేశారు. మంగళగిరిలోని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు అనేక హామీలను ఇచ్చిందని గుర్తుచేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ పిలుపునిచ్చిన నేపథ్యంలో నేటికీ రిజర్వేషన్ల అంశాన్ని కేంద్రం తేల్చకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం కులగణన ప్రక్రియను పూర్తిచేసి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పారేపల్లి మహేశ్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం బీసీ కార్పొరేషన్లను ఏర్పాటు చేసి నిధులు కేటాయించలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే నిధులు వస్తాయని ఆశపడ్డామని తెలిపారు. రాబోయే రోజుల్లో బీసీల సమస్యలపై పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కుమ్మర క్రాంతికుమార్, కోశాధికారి కన్నా మాస్టారు, నేతలు పాల్గొన్నారు.

రైలుకు ఎదురెళ్లి.. వ్యక్తి ఆత్మహత్య

తెనాలి క్రైం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కొలకలూరు - దుగ్గిరాల రైల్వేస్టేషన్ మధ్య గుర్తుతెలియని వ్యక్తి ఎక్స్‌ప్రెస్ రైలుకు ఎదురు వెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడని తెనాలి జీఆర్పీ ఎస్ఐ వెంకటాద్రి శుక్రవారం తెలిపారు. రైలు దుగ్గిరాల స్టేషన్ దాటి వెళ్తున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తి ట్రైన్‌కు ఎదురెళ్లాడు. రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. రైలు డ్రైవర్ సమాచారం మేరకు సంఘటన స్థలానికి ఎస్ఐ పరిశీలించారు. మృతుడి శరీర భాగాలు రైల్వే ట్రాక్ వెంట వివిధ ప్రాంతాల్లో పడి ఉండటం గుర్తించారు. మృతుడికి.. 45-50 సంవత్సరాల వయస్సు ఉంటుందని కాటన్ లుంగీ, ఎరుపు రంగు ఫుల్ హ్యాండ్స్ చొక్కా ధరించినట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఎస్ఐ వెంకటాద్రి వివరించారు.

యూట్యూబ్ చూసి.. చోరీల్లో ఆరితేరాడు

● నెలన్నరలో కార్ల అద్దాలు పగలగొట్టి 18 దొంగతనాలు

● 10 కేసులు నమోదు...నిందితుడు నరసరావుపేట రౌడీషీటర్ బాజీ

● వివరాలు వెల్లడించిన ఎస్పీ సతీష్‌కుమార్


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సతీష్ కుమార్, పక్కన సౌత్ డీఎస్పీ భానోదయ, సీఐ వంశీధర్

గుంటూరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): యూట్యూబ్‌లోని చోరీ వీడియోలు చూసి.. కారు అద్దాలు పగలగొట్టి ఎలా నేరాలు చేయాలో నేర్చుకున్న ఓ రౌడీ షీటర్ అదే తరహాలో వరుస నేరాలకు పాల్పడుతూ పోలీసులకు సవాల్ విసిరాడు. గుంటూరు నగరంలోనే నెలన్నరలో 18కి పైగా నేరాలకు పాల్పడ్డాడు. అయితే అందులో చాలా నేరాల్లో డాక్యుమెంట్లు, అతి తక్కువ మొత్తంలో నగదు పోవడంతో అవి కేసులు నమోదుకు దారి తీయలేదు. జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు సౌత్ డీఎస్పీ భానోదయ ఆధ్వర్యంలోని బృందం.. వరుస నేరాలకు పాల్పడుతోన్న నిందితుడికి చెక్ పెట్టారు. సీసీ కెమెరా ఫుటేజీలతోపాటు ఇతర సాంకేతిక ఆధారాలను క్షుణ్ణంగా పరిశీలించి నిందితుడిని నరసరావుపేట క్రిస్టియన్‌పేటకు చెందిన రౌడీషీటర్ జంగం బాజీగా గుర్తించారు. బాజీని అరెస్ట్ చేసి.. అతని నుంచి ఆరు ల్యాప్‌టాప్‌లు, 11 గ్రాముల బంగారం, రూ.2 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ సతీష్ కుమార్ నిందితుడు బాజీని మీడియా ఎదుట హాజరు పరిచి, వివరాలు వెల్లడించారు. నరసరావుపేటలోని క్రిస్టియన్ పేటకు చెందిన జంగం బాజీ తన సోదరుని చంపిన వ్యక్తులను హత్య చేసిన కేసులో నిందితుడిగా ఉన్నాడు. ఒన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో అతని రౌడీషీట్ కూడా ఉంది. బాజీ వ్యసనాలకు బానిసై డబ్బులు కోసం దొంగతనాలకు పాల్పడుతున్నాడు. అత్యంత చాకచక్యంగా రెప్పపాటులో కారు అద్దాలు పగలగొట్టి అందులో ఖరీదైన వస్తువులు, బ్యాగులు, లాప్‌ట్యాప్‌లు అపహరిస్తున్న హైటెక్ దొంగగా మారాడు. అతని సొంతూరు నాదెండ్ల మండలం గొరిజవోలు గ్రామం. గుంటూరు నగరంలోనే 18 వరకు కారు అద్దాలు పగలగొట్టి చోరీలు చేసిన నేరాలకు పాల్పడ్డాడు. అందులో నల్లపాడు పోలీస్‌స్టేషన్‌లో నాలుగు, నగరంపాలెంలో మూడు, పెదకాకాని, పాత గుంటూరు, అరండల్ పేట పోలీస్ స్టేషన్ల పరిధిలో ఒక్కొక్కటి చొప్పున మొత్తం పది కేసులు మాత్రమే నమోదు అయ్యాయి.

యూట్యూబ్ చూసి..ఆరితేరి..!

బాజీ యూట్యూబ్‌లో వీడియోలు చూసి పోలీసులకు దొరకకుండా ఎలా తప్పించుకోవాలో... నేర్చుకున్నాడు. హెల్మెట్ ధరించి, చేతులకు గ్లౌజులు వేసుకొని నేరాలకు చేయసాగాడు. ముఖ్యంగా పార్కింగ్ స్థలాల్లో పెట్టిన కార్లను టార్గెట్ చేస్తాడు. గులకరాయితో కారు అద్దం పగలగొట్టి అందులో ఉన్న లాప్‌ట్యాప్‌లు, బ్యాగులు, నగదు వంటి వస్తువులను చిటికలో మాయం చేస్తాడు. శివారు ప్రాంతాల్లోని ఏటీఎం సెంటర్లు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, బ్యాంకులు తదితర చోట్ల పార్కింగ్ చేసిన కార్లను, యజమానులను గుర్తించి వారు ఎక్కడికి వెళ్తున్నారో గమనించి ఆ తర్వాత నేరానికి పాల్పడతాడు. బాజీ గతంలో నరసరావుపేట పరిసర ప్రాంతాల్లోనూ ఇతర నేరాలకు పాల్పడినట్లు పోలీసుల దృష్టికి వచ్చింది. ఈ నేపథ్యంలో నల్లపాడు పోలీసులు నిందితుడు బాజీ చెప్పిన వివరాలు ప్రకారం ఆయా ప్రాంతాల్లో ఈ తరహా నేరాల గురించి ఆరా తీస్తున్నారు. ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ ఇటీవల అత్యధిక నేరాల్లో నిందితులను గుర్తించేందుకు సీసీ కెమెరాలే పోలీస్ శాఖకు ఉపయోగపడుతున్నాయన్నారు. బాజీని అరెస్టు చేసిన పోలీస్ అధికారులు, సిబ్బందిని ఎస్పీ సతీష్ కుమార్ అభినందించి రివార్డులు ప్రకటించారు. సీఐ వంశీధర్, ఎస్ఐ వాసు, సీసీఎస్ సీఐ అనురాధ, నల్లపాడు హెడ్ కానిస్టేబుల్ కె.సుబ్బారావు, కానిస్టేబుళ్లు భిక్షు నాయక్, షేక్ మస్తాన్ వలి, టి.సాంబశివరావు తదితరులకు ప్రశంసా పత్రాలు అందించి, అభినందించారు.

తుప్పు పట్టి పోవాల్సిందేనా?


ఫుట్‌ఫాత్‌పై పడవేసిన గడ్డర్లు

తెనాలిఅర్బన్,సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : చందోలు -తెనాలి ప్రధాన రహదారిలో వైకుంఠపురం వద్ద ఫుట్‌పాత్‌పై వేసిన గడ్డర్లు తుప్పు పట్టి పోతున్నాయి. ఇక్కడ ఉన్న రైల్వే ట్రాక్ రక్షణకు ఇరువైపులా అధిక లోడు లారీలు, ఇతర వాహనాలు నివారించేందుకు ఈ గడ్డర్లు ఏర్పాటు చేశారు. అయినా.. కొందరు భారీ వాహన డ్రైవర్లు దీనిని పట్టించు కోకుండా.. ఈ మార్గంలో వెళ్లడంతో..వాహనాలు గడ్డర్లకు తగిలి ఇరుక్కుపోతున్నాయి. ఇలా పలుమార్లు గడ్డర్లు దెబ్బతిన్న ఘటనలు ఉన్నాయి. దెబ్బతిన్న గడ్డర్లను తొలగించి ఫుట్‌పాత్‌లపై పడేశారు. కొద్దిగా దెబ్బతిని వీటిని మరమ్మతులు చేయించి ఉపయోగించకుండా.. ఇలా నిరుపయోగంగా పడేశారు. రైల్వే అధికారులు స్పందించి ప్రజాధనం వృథా కాకుండా చూడాలని కోరుతున్నారు.

దురంతో ఎక్స్‌ప్రెస్‌కు రెండు స్లీపర్ క్లాస్ బోగీలు

గుంటూరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): వారంలో మూడు రోజులు గుంటూరు మీదగా ప్రయాణించే 22204/22203 సికింద్రాబాద్ - విశాఖపట్నం- సికింద్రాబాద్ దురంతో ఎక్స్‌ప్రెస్‌కి రెండు స్లీపర్ క్లాస్ బోగీలను జోడించాలని దక్షిణ మధ్య రైల్వే నిర్ణయించింది. ఈ నెల 20 నుంచి సికింద్రాబాద్ వైపున, 21 నుంచి విశాఖపట్టణం వైపున ఈ స్లీపర్ క్లాస్ బోగీలు ప్రయాణికులకు అందుబాటులోకి వస్తాయి. ఇప్పటికే అడ్వాన్స్ రిజర్వేషన్‌ని కూడా రైల్వే శాఖ ప్రారంభించింది. సికింద్రాబాద్‌లో ప్రతీ సోమ, బుధ, శనివారం రాత్రి 8.15 గంటలకి, విశాఖపట్నంలో మంగళ, గురు, ఆదివారాల్లో రాత్రి 7.50 గంటలకు ఈ రైలు బయలుదేరుతుంది.

అట్టహాసంగా డేగల ప్రభాకర్ జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న డేగల ప్రభాకర్

గుంటూరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ డేగల ప్రభాకర్ జన్మదిన వేడుకలు శుక్రవారం అట్టహాసంగా జరిగాయి. నాజ్ సెంటర్లోని ఆంధ్ర ప్రైమ్ హాస్పిటల్లో జరిగిన వేడుకల్లో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, యువత, కూటమి నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని డేగల ప్రభాకర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్లు, అభిమానులతో కలిసి ప్రభాకర్ కేక్ కట్ చేశారు. డేగల యూత్, మిత్రమండలి ఆధ్వర్యంలో వారోత్సవాలు నిర్వహించి వృద్ధులకు చీరలు, విద్యార్థులకు పుస్తకాల పంపిణీ, అన్నదానం వంటి పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం, అంధ పాఠశాల విద్యార్థులకు మందులు, బ్రెడ్‌లు పంపిణీ చేశారు. సుమారు 70 మంది యువకులు రక్త దానం చేశారు. ముందుగా నాజ్ సెంటర్‌లోని ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారీగా బాణ సంచా పేల్చి.. సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులూ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయాలను, పార్టీ సిద్ధాంతాలను బలోపేతం చేయడంలో ప్రభాకర్ నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. ప్రజా సేవలో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం ఛైర్మన్ డేగల ప్రభాకర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ నామినేటెడ్ పదవులు ఇచ్చి తనలాంటి యువతకు ప్రోత్సాహం ఇచ్చారన్నారు.

10న 'ఈషా' యోగా పరిచయ కార్యక్రమం

అమరావతి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): యోగాతో భావోద్వేగాల నియంత్రణ, మానసిక ప్రశాంతతో పాటు అనేక ఆరోగ్య ప్రయోజనాలు పొందేలా ఇన్నర్ ఇంజనీరింగ్ పేరుతో సద్గురు ఓ కార్యక్రమం రూపొందించారు. ఈ యోగా కార్యక్రమం తిరుపతి, గుంటూరు, కాకినాడ, అనంతపురం, చిత్తూరు, కర్నూలు, కడప జిల్లాల కేంద్రాల్లో తెలుగులో నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా 21 నిమిషాల శాంభవి మహా ముద్ర క్రియ చేయడం ద్వారా లక్షల మంది ఎన్నో ప్రయోజనాలను పొందనున్నారు. ఇందుకు సంబంధించిన వివరాల కోసం ఈ నెల 10న జరిగే ఉచిత పరిచయ కార్యక్రమానికి హాజరుకావాలని ఈషా ఫౌండేషన్ ఓ ప్రకటనలో తెలిపింది. isha.co/ieapt లేదా 0404 1896666 నంబరులో సంప్రదించాలని సూచించింది.

2 కేజీల గంజాయి స్వాధీనం

● పోలీసుల అదుపులో ఆరుగురు నిందితులు

పెదకాకాని, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీసులు గంజాయి కలిగిన ఆరుగురు నిందితులను అదుపులో తీసుకున్నారు. శుక్రవారం రాత్రి పెదకాకానిలోని జాకీర్ హుస్సేన్ నగర్‌కి చెందిన వీరి నుంచి రెండు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. విశాఖపట్నం నుంచి రైలు మార్గం ద్వారా గంజాయిని వీరు తీసుకొచ్చారు. సమాచారం మేరకు పోలీసులు తనిఖీలు చేపట్టి నిందితులను, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.45 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00



మిలాద్ నబీ వేడుకల ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే నసీర్

కూటమి ప్రభుత్వంలో గురువులకు గౌరవం

● గురుపూజోత్సవ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చాక గురువుల స్థానానికి తగిన గౌరవం తీసుకొచ్చామని తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. గురుపూజోత్సవం సందర్భంగా శుక్రవారం అంజుమన్ ఏ ఇస్లామియా పాఠశాలతోపాటు పలు పాఠశాలల్లో నిర్వ హించిన వేడుకల్లో ఎమ్మెల్యే నసీర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ యువనేత, మంత్రి నారా లోకేశ్ చేపట్టిన పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ ద్వారా విద్యావ్యవస్థలో నూతన శైలిని తీసుకొచ్చామన్నారు. డీఎస్సీ ద్వారా 16 వేలకుపైగా ఉద్యోగాలు కల్పించామని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వంలో గురువులను వివిధ యాప్‌లతో వేధించి విద్యార్థులకు చదువులను దూరం చేశారన్నారు.

● ప్రవక్త బోధనలు ఆచరణీయం

మహమ్మద్ ప్రవక్త బోధనలు ఆచరణీయమని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. మిలాద్- ఉన్-నబీ పండుగ సందర్భంగా శుక్రవారం గుంటూరు నగరంలో నిర్వహించిన భారీ ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మత పెద్దలతో కలిసి ఇస్లామిక్ ప్రవచనాలు పలికారు.

సానుకూల మనస్తత్వంతోనే సమాజ మార్పు

● టెడ్ ఎక్స్ వేదికపై ఎమ్మెల్యే గల్లా మాధవి



గల్లా మాధవికి జ్ఞాపికను అందజేస్తున్న నిర్వాహకులు

గుంటూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): 'సానుకూల మనస్తత్వం సమాజాన్ని మార్చగలదు. సమస్యలను దాటుకొని ముందుకు సాగేందుకు ప్రతి ఒక్కరి లోపల శక్తి ఉంది' అని గల్లా మాధవి చెప్పారు. హైదరాబాదులోని సింబియోసిస్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీలో జరిగిన ప్రతిష్టాత్మక టెడ్ ఎక్స్ కార్యక్రమంలో శుక్రవారం ఆమె పాల్గొని ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఈ వేదికపై మాట్లాడిన తొలి రాజకీయ నాయకురాలిగా నిలిచారు. యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే లక్ష్యంగా స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు.

శాంతికి, సౌభ్రాతృత్వానికి ప్రతీకగా చవితి వేడుకలు

వినాయక చవితి వేడుకలు ప్రజల్లో ఐక్యత, శాంతి, సౌభ్రాతృత్వాలను పెంపొందిస్తాయని పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి అన్నారు. నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన పలు వినాయక మండపాలను శుక్రవారం ఆమె సందర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినాయక చవితి మహోత్సవాల్లో భాగంగా జరుగుతున్న అన్నసమారాధన కార్యక్రమాలను ప్రారంభించి, భక్తులకు ప్రసాదాలను వడ్డించారు.

వైసీపీ పుట్టుకే ఫేక్ : కనపర్తి శ్రీనివాసరావు



కనపర్తి శ్రీనివాసరావు

గుంటూరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): అసత్యాలు, అబద్ధాల పునాదులపైనే వైసీపీ ఏర్పడిందని, ఆ పార్టీ పుట్టుకే ఒక ఫేక్ అని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు చెప్పారు. పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'జగన్ రెడ్డికి సెల్ ఫోన్ లేదు. భార్గవరెడ్డికి బ్యాంకు అకౌంట్ లేదని' సకల శాఖల మాజీ మంత్రి సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పే కాకమ్మ కబుర్లు వినటానికి ప్రజలు సిద్ధంగా లేరని అన్నారు. వైఎస్సార్ చనిపోయిన ఆరు నెలలకే తెలంగాణాకు చెందిన కొలిశెట్టి శివకుమార్ స్థాపించిన యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీని బెదిరించి సొంతం చేసుకున్న వారి ఫేక్ బతుకులు అందరికీ తెలిసిందే అన్నారు. మద్యం కుంభకోణంలో నిందితులు జైలుకు పోవటమే తప్ప తిరిగి రావటం ఉండదన్న విషయం తెలిసే సజ్జల తన పుత్రరత్నం కోసం ఆరాట పడుతున్నాడని అన్నారు. అధికార మదంతో కడపజిల్లా సీకే దిన్నె గ్రామంలో 300 కోట్లు ఖరీదు చేసే అటవీ భూములను ఆక్రమించుకున్న సజ్జల కుటుంబం మొత్తం జైల్లో సేదతీరక తప్పదన్నారు.

కొడుకు అరెస్టు తప్పదనే సజ్జల భయం

● పిల్లి మాణిక్యరావు

గుంటూరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుడు జగన్ అరెస్ట్ అయినా బాధపడని సజ్జల, తన కొడుకు భార్గవ్ అరెస్టు అవుతాడని భయపడుతున్నాడని ఏపీ లిడ్ క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యరావు శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. దేశంలోనే నెంబర్‌వన్ క్రిమినల్‌గా పేరొందిన జగన్ వద్ద బంట్రోతుగా పనిచేస్తున్న సజ్జల ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడాలని హెచ్చరించారు. చంద్రబాబు, లోకేశ్ గురించి పిచ్చిగా మాట్లాడితే నాలుక కోస్తాం అంటూ విరుచుకుపడ్డారు. అధికారంలో ఉన్నప్పుడు మంత్రులు, ఎమ్మెల్యేలతో బూతులు మాట్లాడించిన వ్యక్తి సజ్జల అని ఆగ్రహం వ్యక్తంచేశారు. సోషల్ మీడియా కన్వీనర్‌గా మహిళల వ్యక్తిత్వాన్ని కించపరిచేలా పోస్టులు పెట్టిన కొడుకు సజ్జల భార్గవ్‌ను చూసి సజ్జల సిగ్గుపడాలన్నారు. మద్యం కుంభకోణంలో సజ్జల భార్గవ్ జైలుకు వెళ్లడం ఖాయమని, దానిని ఎవరు ఆపలేరనీ అన్నారు.



టీడీపీ జిల్లా కార్యాలయంలో గురుపూజోత్సవం

కులమతాలకతీతంగా గురువులకు పూజ

● దాసరి రాజామాస్టారు

గుంటూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కులమతాలకు అతీతంగా గురువును పూజించుకునే సంస్కృతిని కలిగి ఉండటం చాలా సంతోషమని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ మాజీ ఛైర్మన్ దాసరి రాజామాష్టారు అన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం గురుపూజోత్సవ కార్యక్రమం నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులైన దాసరి రాజామాష్టారు, ఉప్పల శ్రీనివాస్‌ప్రసాద్‌లను సన్మానించారు. గత వైసీపీ పాలనలో గురువులను మద్యం దుకాణాల ముందు కాపలా పెట్టించి వారిని అవమానపరిచారన్నారు. కానీ కూటమి పాలన రాగానే డీఎస్సీ నిర్వహించి యువతను గురువులను చేసిందని అన్నారు. సమావేశంలో కంచర్ల శివరామయ్య, యడ్లపల్లి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

రజకులపై దాడి చేసిన వారిని తక్షణమే అరెస్టు చేయాలి

● లాడ్జి సెంటర్లో ప్రజా సంఘాల నిరసన

గుంటూరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా కొత్తవలస గ్రామంలో రజకు లపై దాడి చేసిన వారిని తక్షణమే అరెస్టు చేసి శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ రజక జన సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. రజకులపై దాడి చేయటాన్ని నిరసిస్తూ శుక్రవారం లాడ్జి సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం ఎదుట నినాదాలతో నిరసన వ్యక్తం చేశారు. జూపూడి మాట్లాడుతూ రాష్ట్రంలో రోజురోజుకు దళితులు, రజకులపై దాడులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కొత్తవలస గ్రామంలో దాడి ఘటనలో అరసవల్లి హరమ్మ అనే వృద్ధురాలు మృతి చెందిందని ఆగ్ర హం వ్యక్తం చేశారు. మృతురాలి కుటుంబ సభ్యులకు రూ.50 లక్షల పరిహారం అందించి ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బహుజన్ మహాసభ సెంట్రల్ కమిటీ కార్యదర్శి భగత్‌సింగ్, అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్ యూనియన్ అధ్యక్షులైన మానేపల్లి దుర్గారావు, వట్టికూటి సాంబయ్య, నల్లపు నీలాంబరం తదితరులున్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



ఉపాధ్యాయుల్ని సత్కరిస్తున్న పిడికిటి తిలక్‌బాబు తదితరులు

గుంటూరు(విద్య), సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక అశోక్‌నగర్ 2లైన్‌లో తెలుగు నాడు ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు పసల బాలస్వామి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎన్నారై విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పిడికిటి తిలక్‌బాబు, రాష్ట్ర మహిళా కార్యదర్శి పద్మావతి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల్ని సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎన్‌వీ జగదీష్‌కుమార్, కార్యదర్శి పాలేటి జగదీష్‌బాబు, కోశాధి కారి శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో..

స్థానిక సాంబశివపేటలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో గురు పూజోత్స వం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బత్తుల ఉమాదేవి మా ట్లాడుతూ సర్వేపల్లి రాధకృష్ణన్ జీవితం ప్రతిఒక్కరికి ఆదర్శనీయమన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్స్ మాధవీలత, సుచరిత, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

● రాష్ట్రీయ పండిత పరిషత్ గుంటూరు జిల్లా కార్యాలయంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యారంగానికి ఆయన అందించిన సేవలు నేటి ఉపాధ్యాయులకు స్ఫూర్తి అని సంఘం నాయకులు శ్లాఘించారు.

● స్థానిక ఎన్జీవోకాలనీలోని సుమేధ స్కూల్లో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల్ని పాఠశాల డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర రెడ్డి ఆధ్వర్యంలో సత్కరించారు.

ఎన్టీఆర్ స్టేడియంలో...

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి క్లబ్ అధ్య క్షుడు షేక్ లాల్‌వజీర్ పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు కవిత, పార్వతి, సంధ్య, సౌరయ్య, కిషోరిలను క్లబ్ సభ్యులు ఘనంగా సత్కరించారు.

సీతారామయ్య హైస్కూల్లో...

గుంటూరు (కార్పొరేషన్), సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీపురంలోని శ్రీ పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్క రించుకొని ఉపాధ్యాయ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం లో పాల్గొన్న పాఠశాల కమిటీ సెక్రటరీ, కరెస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్‌కి గురువు, పాఠశాల పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావుని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గింజుపల్లి మాట్లాడుతూ.. పిల్లలకు విద్యతో పాటు విలువలను కూడా నేర్పా లని తెలిపారు. విష్ణువర్ధన్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల అందరికి ఉపాధ్యాయదినోత్సవ శుభాకాంక్షలు తెలియచేస్తూ భావిభారత పౌరులను తీర్చిదిద్దే బాధ్యత ప్రతి ఉపాధ్యాయు డిపై ఉందని తెలియజేసారు. చిన్నారులు వారి ఆట పాటలతో, ఉపాధ్యాయుల వేషధారణ లతో అలరించారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రెసిడెంట్ సూర్యదేవర హనుమంత రావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ళ కృష్ణవేణి, ప్రిన్సిపాల్ దోనకాయల దుర్గాశ్యామ్, ప్రైమరీ కోఆర్డినేటర్ దిల్ జహాన్, ప్రీ ప్రైమరీ కోఆర్డినేటర్ టి.శ్రీదేవి, ఇన్‌చార్జి కె.హరిప్రియ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సీతారామయ్య హైస్కూల్లో జరిగిన గురుపూజోత్సవాల్లో పాల్గొన్న యాజమాన్యం, ఉపా ధ్యాయులు

ఆర్య సమాజం ఆధ్వర్యంలో....

గుంటూరు(విద్య), సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక పాత గుంటూరు గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆర్యసమాజ గోవర్ధన గోశాల వైదిక పురోహితులు మోతుకూరి సాంబశివరావు ఆర్యని సిద్ధు ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో జరుగుతున్న 28వ సంవత్సర గణపతి నవరాత్రుల మండపంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పసల అజయ్‌కుమార్, సాయి భార్గవి, అనపర్తి కోటేశ్వరరావు, తిరుమలశెట్టి సాయికిరణ్, ఆర్య సమాజ సభ్యులు వి.ప్రసన్నకుమారి సీహెచ్ రమేష్, వి.సదాశివరావు తదితరులు పాల్గొన్నారు.



మోతుకూరి సాంబశివరావును సత్కరిస్తున్న సభ్యులు

50 ఏళ్ల క్రితం పాఠాలు చెప్పిన గురువుకు సన్మానం

గుంటూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సరిగ్గా 50 ఏళ్ల క్రితం తమతో ఓ నమాలు దిద్దించి చదువు చెప్పిన గురువుకు ఆమె శిష్యులు గురుపూజోత్సవం సందర్భంగా ఘనంగా సన్మానించారు. అరండల్‌పేట 16వ లైనులోని ఆర్‌సీఎం ప్రాథమిక పాఠశాలలో సుశీల టీచర్‌ని ఆమె వద్ద విద్యాభ్యాసం చేసిన విద్యా ర్థులు శుక్రవారం సన్మానించారు.



ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు



ప్రత్యేక అలంకరణలో గణపతి, అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు

వైభవంగా గణపతి ఉత్సవాలు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక వెంకటరమణ కాలనీలో పార్వతీపుత్ర సేవాసమితి ఆధ్వర్యంలో గణపతి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. దంపతులచే వేద పండితులు హోమాలు జరిపించారు. గేట్‌చంద్ ఆధ్వర్యంలో భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పగడాల సుబ్బారెడ్డి, యాదవ్, మామిడి రామారావు, మరమంచి శ్రీనివాసులు, మామిడి రామారావు పాల్గొన్నారు.

పాతగుంటూరులో రూ.15 లక్షలతో అలంకరణ

గుంటూరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): పాతగుంటూరు కొండావారి వీధి శ్రీసిద్ధి వినాయక ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో నవమ గణపతి మహోత్సవాలు వైభవంగా జరుగుతు న్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం రూ.15 లక్షల కరెన్సీ నోట్లతో లక్ష్మీ గణపతి అలంక రణలో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు అంకమ్మరావు, అనీల్, బాలచంద్ర, పృథ్వీరాజ్, గోపి తదితరులున్నారు.

రమా సహిత సత్యన్నారాయణ స్వామి ఆలయం వద్ద...

గుంటూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అరండల్‌పేట 12/1వ లైనులోని రమా సహిత సత్యన్నారాయణ స్వామి ఆలయం వద్ద నిర్విఘ్నంగా 41వ గణేష్ వేడుకలను ఈ ఏడాది నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి అన్నారు. వేడుకల్లో భాగంగా శుక్రవారం ఆయన అన్నదానం ప్రారంభించారు. కార్యక్రమంలో అర్బన్ బ్యాంకు ఛైర్మన్ బోనబో యిన శ్రీనివాసయాదవ్, యంగ్‌వన్స్ అసోసియేషన్ కన్వీనర్ ఆల సాంబశివ రావు, కమిటీ నాయకులు పాల్గొన్నారు.

ఆదిత్రీలో రూ.లక్షా 20 వేలు పలికిన లడ్డు

స్థానిక విద్యానగర్ ఒకటో లైన్ ఎక్స్‌టెన్షన్‌లోని ఆదిత్రీ ఎగ్జోటికా అపార్ట్మెంట్స్‌లో ఘనంగా వినాయక చవితి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా శుక్రవారం వినాయకుడి వద్ద ఉంచిన లడ్డూ వేలంపాటలో 15 కిలోల లడ్డును ఆదిత్రీ ఎగ్జోటికా అపార్ట్మెంట్‌కు చెందిన మేకల నవీన్‌కుమార్, శిల్ప దంపతులు రూ.లక్ష 20 వేలకు దక్కించుకున్నారు.



ఆదిత్రీలో జరిగిన వినాయక చవితి వేడుకల్లో పాల్గొన్న అపార్ట్మెంట్ వాసులు

పాలస్తీనాకు అండగా నిలబడాలి

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఇజ్రాయేల్ దాడుల్లో సర్వం కోల్పోయిన పాలస్తీనాకు ప్రతి ఒక్కరూ అండగా నిలబడాలని ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఏ చిస్టీ అన్నారు. పాలస్తీనాకు సంఘీభావం తెలుపుతూ శుక్రవారం స్థానిక పాత బస్టాండ్ వద్ద ప్రోగ్రెసివ్ ఫోరమ్ గుంటూరు వారి ఆధ్వర్యంలో శాంతియుత నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 22 నెలలుగా అమెరికన్ సామ్రాజ్యవాదుల అండతో ఇజ్రాయిల్ పాలస్తీనా, గాజా మీద చేస్తున్న దాడులకు సుమారు 70 వేల మంది పిల్లలు, మహిళలు చనిపోవడంతో పాటు లక్షలాది మంది క్షతగాత్రులయ్యారన్నారు. ఐక్యరాజ్యసమితి చేసిన తీర్మానాలను లెక్కచేయకుండా ఈ దాడులకు పాల్పడు తుందని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో పాలస్తీనాకు మద్దతు ఇవ్వాలని కోరా రు. ఈ కార్యక్రమానికి ముక్తి కబీ అధ్యక్షత వహించగా, కార్యక్రమంలో ముక్తి అబ్దుల్ బాసిత్, ముక్తి ఆసిఫ్, ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

మందులు, వైద్య పరికరాలపై జీఎస్టీను పూర్తిగా ఎత్తివేయాలి

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మందులు, వైద్యపరికరాలపై జీఎస్టీని పూర్తిగా తొలగించి, ప్రజలపై భారాన్ని తగ్గించాలని ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.వెంకట్రావు కోరారు. బ్రాడీపేట, సీపీఎం కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన విధానం మేరకు 37 అత్యవసర మందులపై జీఎస్టీను సున్నా చేయడాన్ని ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కుమార్ మాట్లాడుతూ యూనియన్ ఆధ్వర్యంలో గతంలో చేసిన పోరాటాల ఫలితమే జీఎస్టీ తగ్గించారన్నారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు షేక్ అబ్దుల్ కలాం, సీహెచ్ ఫణీంద్ర, జి.శ్రీనివాసరావు, మల్లికార్జునరావు, జి.అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ జిల్లా ఉపాధ్యక్షుడిగా గోపిరెడ్డి



రాష్ట్ర చైర్మన్ శ్యామల కోటిరెడ్డి నుంచి నియామక ఉత్తర్వులు అందుకుంటున్న గోపి రెడ్డి తదితరులు

గుంటూరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ జిల్లా ఉపాధ్యక్షుడిగా బొంతు గోపిరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు కొరిటెపాడులోని కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో సంస్థ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ జయశ్యామల కోటిరెడ్డి నియామకపు ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా గోపిరెడ్డి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా సామాన్యులు ఎదుర్కొనే సమస్యలను పరిష్కరించేందుకు నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ కృషి చేస్తుందన్నారు. తనకు అవకాశం కల్పించిన చైర్మన్ శ్యామల జయ కోటిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. జాతీయ మానవహక్కుల కమిటీ జాతీయ చైర్మన్ మహమ్మద్ యాసిన్, జాతీయ ప్రధాన కార్యదర్శి బి.శ్రీనివాస్‌రెడ్డి ఈ సందర్భంగా గోపిరెడ్డి కి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ జిల్లా కమిటీ సోషల్ మీడియా కన్వీనర్ చెరుకూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అప్పుల బాధతో రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆత్మహత్య

గుంటూరు సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక స్వర్ణ భారతినగర్‌కు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి వడితే ధర్మానాయక్ (27) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నల్లపాడు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పల్నా డు జిల్లా మాచవరం మండలం రుక్మిణీపురం తండాకు చెందిన వడితే ధర్మానాయక్ స్వర్ణ భారతినగర్‌కు చెందిన రాజ్యలక్ష్మిని వివాహం చేసుకొని ఇక్కడే ఉంటున్నాడు. ధర్మానాయక్ రియల్ వేస్టేట్ వ్యాపారం చేస్తూ అప్పుల పాలయ్యాడు. ఈ క్రమంలో ఈనెల 4న స్వర్ణభారతినగర్ నుంచి పెదపలకలూరు మధ్యలో పురుగుల మందు తాగి భార్యకు ఫోన్ చేసి చెప్పడంతో ఆమె వెంటనే ధర్మానాయక్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు మృతుడి తండ్రి జయరాంనాయక్ ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిమజ్జనం ఊరేగింపునకు వెళ్లి వస్తూ వ్యక్తి దుర్మరణం

గుంటూరు సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వినాయకుడి విగ్రహం నిమజ్జనానికి వెళ్లి వస్తూ వ్యక్తి మృతి చెందాడు. ఓ ఘటనలో ప్రత్తిపాడు మండలం చినకొండ్రుపాడు గ్రామానికి చెందిన చల్లా రాంబాబు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. రాంబాబు మిర్చి యార్డులో కాపలా పని చేస్తూ సమీపంలోని ఆదర్శనగర్ లో నివాసం ఉంటున్నాడు. ఈ నెల నాలుగు రాత్రి వినాయకుడి ఊరేగింపు ముగించుకుని శుక్రవారం తెల్లవారుజామున తన స్కూటీపై గుంటూరు బయలుదేరాడు. కొత్తూరు సమీ పంలోకి రాగానే వెనుక నుంచి వచ్చిన గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టి వెళ్లిపోయింది ఈ ఘటనలో రాంబాబు తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడే మృతి చెందాడు. మృతుడు తండ్రి చల్ల పెద్ద శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొల్లి శారద కూరగాయల మార్కెట్ యథావిధిగా కొనసాగుతుంది

● రైతులు ఈ మార్కెట్‌లోనే క్రయ, విక్రయాలు చేసుకోవాలి

● కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు (కార్పొరేషన్), సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): నగరంలో నగర పాలక సంస్థ కొల్లి శారద హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ యథావిధిగా కొనసాగుతుందని, రైతులు కేవలం ఈ మార్కెట్‌లోనే కూరగాయల క్రయ, విక్రయాలు చేసుకోవాలని, నగరంలో అనుమతిలేని ప్రాంతాల్లో విక్రయించిన ఎడల చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో జాతీయ రహదారి సర్వీస్ రోడ్లలో, అన్నపూర్ణ కాంప్లెక్స్ పరిసర ప్రాంతాల్లో నగరపాలక సంస్థ అనుమతి లేకుండా రాత్రి వేళల్లో హోల్‌సేల్ కూరగాయల విక్రయాలు జరుగుతున్నాయని ఫిర్యాదులు అందాయన్నారు. రైతులు దళారుల మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. ఇప్పటికే జిల్లా పోలీస్ అధికా రులకు, జాతీయ రహదారి నిర్వహణ, మార్కెటింగ్ శాఖ అధికారుల దృష్టికి ఫిర్యాదులను తీసుకెళ్లామన్నారు.

తురకపాలెం మరణాలు దురదృష్టకరం : బీజేపీ

గుంటూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తురకపాలెంలో తీవ్ర అస్వస్థతకు గురై పలువురు చనిపోవడం దురదృష్టకరమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు అన్నారు. ఒక్క ఎస్సీ కాలనీలోనే 27 మంది మరణించడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం తురకపాలెం ఆకస్మిక మరణాలు జరిగిన కుటుంబాలను బీజేపీ నాయకులు పరామర్శించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దర్శనపు శ్రీనివాసరావు, ఇతర నాయకులు దేసు సత్యనారాయణ, తోట శ్రీనివాసరావు, కంచర్ల రాజేష్, నీలం సాంబశివరావు, సుబ్బారావు, దారా అంబేద్కర్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి : ముప్పాళ్ల

గుంటూరు (మెడికల్), సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): తురకపాలెంలో జ్వర బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాల నాగేశ్వరరావు కోరారు. తురకపాలెంలో జరుగుతున్న అంతుచిక్కని మరణాలు ఆందోళన కలిగిస్తున్న నేపథ్యంలో సీపీఐ నాయకుల బృందం శుక్రవారం గ్రామాన్ని సందర్శించి ప్రజల సమస్యలు తెలుసుకుంది. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్, జిల్లా కార్యదర్శి కే.మాల్యాద్రితో కలసి ఆయన మాట్లాడారు. గ్రామస్థులకు రక్షిత మంచినీటిని అందించాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఇప్పటికే పరిశీలించినప్పటికీ స్పష్టమైన కారణాలు బయటకు రాలేదన్నారు. ప్రభుత్వం ఈ సమస్యను అత్యంత ప్రాధాన్యంగా తీసుకో వాలని ఆయన కోరారు. మరణించిన కుటుంబాలకు రూ.10 లక్షల నష్టపరిహారం తక్షణమే ఇవ్వాలని నాగేశ్వరరావు డిమాండ్ చేశారు.

ఆర్థిక నేరాల్లో ఆరితేరిన తల్లీ కొడుకులు

● 4.5 కోట్ల విలువైన ఆస్తికి తప్పుడు దస్తావేజుల సృష్టి

● తల్లీ కొడుకు అరెస్టు... నిందితులపై 8 ఇదే తరహా కేసులు



వివరాలు వెల్లడిస్తున్న వెస్ట్ డీఎస్పీ అరవింద్, నగరంపాలెం సీఐ నజీర్‌బేగ్

గుంటూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అమా యకులకు మాయమాటలు చెప్పి ఆర్థిక నేరాలకు పాల్ప డుతూ కోట్లు కొల్లగొడు తున్న తల్లీకొడుకుల ఉదం తం మరోసారి చర్చనీ యాంశమైంది. రియల్ ఎస్టేట్ ముసుగులో వైట్ కాలర్ నేరాలకు పాల్పడుతున్న పండరీపురం 4వ లైనుకు చెందిన తల్లీ కొడు కులు గడ్డం(పాల్వాయి) ప్రసన్నలక్ష్మి, ఆమె కుమారుడు పాల్వాయి జయకృష్ణ లను నగరంపాలెం పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేర కు శుక్రవారం నగరం పాలెం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెస్ట్ డీఎస్పీ అరవింద్, సీఐ నజీర్‌బేగ్ నిందితులైన తల్లీకొడుకులను మీడియా ఎదుట హాజరుపరచి వివరాలు వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నగరంపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని కన్నా వారి తోటలో ఒక ఆస్తిని సుమారు నాలుగు కోట్ల 50 లక్షలకు అమ్ముతామని 2015 సంవత్సరంలో పల్నాడు జిల్లా పిడుగురాళ్ల పట్టణం రామాలయం ప్రాంతానికి చెందిన పచ్చిపులుసు రామనాథం అనే వ్యక్తిని నమ్మించి నకిలీ ఆస్తి ధ్రువపత్రాలు సృష్టించి, బాధితుల పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించారు. బాధితుల నుంచి పలు దఫాలుగా ఆస్తి విక్రయానికి సంబంధించి నగదు తీసుకున్నారు. అప్పట్లో ఆస్తి యజమాని ఫిర్యాదు మేరకు పోలీసులు ప్రసన్నలక్ష్మితో పాటు ప్రస్తుత కేసులో బాధితుడైన పచ్చిపులుసు రామనాథంను కూడా అరెస్టు చేసారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్త యిన తర్వాత బాధితులు ఆస్తిని స్వాధీనం పరుచుకోవడానికి వెళ్లినపుడు ఆ ఆస్తి ప్రసన్న లక్ష్మి, జయకృష్ణలది కాదని, వారు మోసం చేశారని తెలుసుకొని తమ డబ్బులు తిరిగి ఇవ్వాలని నిందితులను కోరగా ఇస్తామని మాయమాటలు చెపుతూ దాట వేస్తూ వచ్చా రు. విసిగిపోయిన బాధితులు నిందితులను గట్టిగా నిలదీయగా మీకు చేతనైనది చేసుకోండి, మీ డబ్బులు ఇవ్వం, మరోసారి అడిగితే మీ అంతు చూస్తాం అని బెదిరించారు. దీంతో బాధితులు నగరంపాలెం పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయగా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు వెస్ట్ డీఎస్పీ అరవింద్ పర్యవేక్షణలో నగరంపాలెం సీఐ నజీర్ బేగ్ కేసు నమోదు చేసారు. ఈ కేసులో శుక్రవారం నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కేసులో ప్రసన్నలక్ష్మి చెల్లెలు కూడా నిందితురాలిగా ఉన్నారని త్వరలో ఆమెను కూడా అరెస్టు చేయనున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఆమె పేరుతోనే దస్తావేజులు సృష్టించి మోసా లకు పాల్పడుతున్నట్లు ఆయన తెలియజేసారు.

వీరిపై ఇప్పటికే 8కి పైగా కేసులు

పోలీసుల దర్యాప్తులో నిందితులు రియల్ ఎస్టేట్ ముసుగులో పలు ఆర్థిక నేరాలకు పాల్పడినట్లు తేలింది. వీరిపై కేసులు కూడా నమోదై జైలు కూడా వెళ్లి వచ్చారని డీఎస్పీ తెలిపారు. వీరిపై మొత్తం 8 కేసులు నమోదయ్యాయన్నారు. అందులో పట్టాభిపురం స్టేషన్‌లో 3 కేసులు, మంగళగిరిటౌన్, నల్లపాడు, అచ్చంపేట పోలీస్‌స్టేషన్‌లలో ఒక్కొక్కటి చొప్పున, నెల్లూరు జిల్లా గూడూరు వన్‌టౌన్ స్టేషన్‌లో 2 కేసులు నమోదయ్యాయన్నారు.

శారదాకాలనీలో యువతి అదృశ్యం

స్థానిక అరండల్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని శారదాకాలనీ 21వలైను మార్జిన్‌కు చెం దిన మోటమర్రి భారతి(23) అదృశ్యమైంది. భారతి అనే మహిళ హోటల్‌లో పని చేసుకుని జీవిస్తుంది. చిన్నప్పటి తన చిన్నమ్మ పంబ వెంకట రమణ వద్ద ఉంటోంది. ఈ నెల ఒకటిన మధ్యాహ్నం సమయంలో పనులు ముగించుకున్నాక నేను తర్వాత వస్తాను నువ్వు ఇంటికి వెళ అని చిన్నమ్మని పంపించేసింది. ఎంతసేపటికి తిరిగి ఇంటికి రాలేదని బంధువుల ఇళ్లలో వెతికిన ఆచూకీ దొరకలేదని ఆమె చిన్నమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అరండల్‌పేట ఎస్ఐ కృష్ణబాజీబాబు తెలిపారు.

ఖాతా నుంచి 3 లక్షలు మాయం చేసిన సైబర్ నేరగాళ్లు

మారిన సెల్‌ఫోన్ నెంబర్ ఉపయోగించుకుని బాధితురాలి బ్యాంకు ఖాతా నుంచి సైబర్ నేరగాళ్లు సుమారు మూడు లక్షలు కొట్టేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మల్లికార్జునపేటకి చెందిన జంగాలపల్లి అమూల్య అను యువతికి ముత్యాల రెడ్డినగర్ ఎస్‌బీఐలో ఖాతా ఉంది. అయితే కొన్ని సంవత్సరాల క్రితం పైచదువుల నిమి త్తం విదేశాలకి వెళ్లటం వల్ల సదరు అకౌంట్‌కి లింక్ అయిన ఫోన్ నంబర్‌ను వాడటం లేదు. కొన్ని నెలల క్రితం సదరు బ్యాంకును సంప్రదించి ఫోన్‌నంబర్ మార్చమని కోరిన ప్పటికీ, మెయిల్స్ పంపినప్పటికీ బ్యాంకు వారు స్పందించలేదు. ఈ లోగా సదరు మొబైల్ నంబర్‌ను జియో వారు వేరే వారికి కేటాయించారు. సదరు గుర్తు తెలియని వ్యక్తి ఆ ఫోన్ నంబరుని ఉపయోగించి అమూల్య మెయిల్ ఐడీ మార్చి రూ.2 లక్షల 96 వేలు వాడుకున్నట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసున్నట్లు అరండల్ పేట ఎస్ఐ కృష్ణ బాజీబాబు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్‌ల నిర్వహణలో భాగంగా గడ్డిపాడు, గణేష్‌నగర్, ఏఎస్ కన్వెన్షన్, గాయత్రీనగర్ ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ పీహెచ్ ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. అలానే కొరిటపాడు ఒకటోలైను నుంచి ఐదో లైను వరకు, శాంతినగర్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ ముస్తఫా మరో ప్రకటనలో పేర్కొన్నారు.

పడిపోయిన పరపతి

(5వ పేజీ తరువాయి)

వర్సిటీని ప్రక్షాళన చేయాల్సింది పోయి ఓ ఉన్నతాధికారి అన్ని అంశాలకు అడ్డుగా ఉంటున్నారన్న ఆరోపణలున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రం లోని అన్ని యూనివర్సిటీ లకు పూర్తి స్థాయి వీసీ నియామకానికి నోటిఫికేషన్ లు వచ్చాయి. ఒక్క ఎన్ జీ రంగా యూనివర్సిటీ మాత్రం నోటిఫికేషన్ నుంచి తప్పించినట్లు ఆరోపణలు ఉన్నాయి.

పీఎం, సీఎం ఆలోచనలకు బ్రేక్‌లు..

వ్యవసాయ రంగంలో యాంత్రీకరణకు పెద్ద పీట వేయాలన్నది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆలోచన. అందులో భాగంగానే నమో దీదీ పథకం ద్వారా డ్రోన్లు అందజేసేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఇందుకు అనుగుణంగా గ్రామాల్లోని రైతులను యూనివర్సిటీకి పిలిపించి డ్రోన్ పైలెట్ శిక్షణ కార్యక్రమాన్ని కొంతకాలం నిర్వహించారు. ఎప్పుడైతే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందో అప్పటి నుంచి శిక్షణను అర్థాంతరంగా నిలిపివేశారు. ఇన్‌చార్జి వీసీ ఆదేశాలతోనే డ్రోన్ పైలెట్ శిక్షణ కార్యక్రమాన్ని నిలిపివేసినట్లు తెలుస్తుంది. ఒకపక్క రైతులకు డ్రోన్లు పంపిణీ చేసి వ్యవసాయ రంగంలో వినూత్నమైన మార్పులు తీసుకురావాలని సీఎం చంద్రబాబు భావిస్తూ ఉంటే మరో పక్క అందుకు భిన్నంగా వీసీ ఆదేశాల ఇవ్వడం చర్చనీయాంశంగా మారుతుంది.

అంతు చిక్కని మరణాలపై పరీక్షలు

(5వ పేజీ తరువాయి)

అక్కడికి పరిస్థితులను తెలుసుకున్నారు. ఇటీవల మరణించిన వారి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి వెళ్లి ఇప్పటివరకు జరిగిన పరీక్షల వివరాలను తెలుసుకున్నారు. అదేవిధంగా బాధితుల ఇళ్లను సందర్శించి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. వైద్య శిబిరంలో రోగులకు అందిస్తున్న సేవల గురించి గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి, డీఎంహెచ్‌వో డాక్టర్ కే విజయలక్ష్మి మంత్రులకు వివరించారు. మంత్రుల వెంట ప్రజారోగ్య శాఖ సంచాలకులు డాక్టర్ పద్మావతి, ఆరోగ్య శాఖ కమిషనర్ వీరపాండియన్, వైద్య విద్య సంచాలకులు డాక్టర్ జీ రఘునందన్, కలెక్టర్ నాగలక్ష్మి, ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు ఉన్నారు.

అపోహలను నమ్మవద్దు : పెమ్మసాని

అంతు చిక్కని జ్వరాలకు బ్లడ్ కల్చర్ పరీక్షల ఫలితాల తర్వాతే స్పష్టత వస్తుందని డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. సూడోమల్లీ బ్యాక్టీరియా కారణంగా వచ్చే మెలియాయిడోసిస్ జ్వరాలు గ్రామంలో ప్రబలినట్లు వార్తలు వస్తున్నాయన్నారు. అయితే తాగునీరు ద్వారా ఈ వ్యాధి రాదన్నారు. అపోహలను నమ్మవద్దన్నారు. అరుదైన వ్యాధి కావడం ఎవరికీ సరైన అవగాహన లేకపోవడం, తెలుసుకునేందుకు కొంత సమయం పడుతుందని తెలిపారు. ఇది సర్వ సాధారణంగా కనిపించే వ్యాధి కాదని, తాను డాక్టర్‌గా ప్రాక్టీస్ చేసిన సమయంలో కూడా ఇలాంటి వ్యాధిని చూడలేదన్నారు. పూర్తిస్థాయిలో వ్యాధి నిర్ధారణ పరీక్షల అనంతరమే మెలియాయిడోసిస్ వ్యాధి గురించి తేల్చి చెప్పగలమని ఆయన అభిప్రాయపడ్డారు. బ్లడ్ కల్చర్ రిపోర్టులు శనివారం వెల్లడించే అవకాశం ఉంది. ఈ ఫలితాలు వస్తేనే తురకపాలెంలో ఇన్ఫెక్షన్‌కు దారి తీసిన కారణాలపై స్పష్టత వస్తుందని ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రకటించారు.

ప్రైవేటు వైద్యనిపుణుల సాయం...

తురకపాలెంలో ప్రబలిన అంతుపట్టని వ్యాధుల నిర్ధారణకు గుంటూరులోని కొందరు ప్రైవేటు వైద్యనిపుణుల సాయం తీసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ నిర్ణయించింది. సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్‌లైన వీరు ఆరోగ్య శాఖను సమన్వయం చేసుకుని రోగుల వ్యాధి నిర్ధారణలో తమ వంతు సాయం అందిస్తారు. దీనికి సంబంధించిన విధి విధానాలు ఒకటి, రెండు రోజుల్లో వెలువరిస్తారు.

బంగారం!

- పెట్టుబడిదారుల చూపుతో.. సామాన్యులకు దూరం
- వారంలో 24 క్యారెట్ల గ్రాము ధర రూ.1000 పెరుగుదల
- పది గ్రాములు రూ.1.11లక్షలకు చేరువ
- శ్రావణ మాసంలోనూ కొనుగోలుకు ప్రజలు దూరం

గుంటూరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): బంగారం అంటే ప్రతి ఒక్కరికీ మోజే.. సంపన్నులు మొదలు రోజువారీ కాయకష్టం చేసుకునేవారి వరకూ ప్రతి ఒక్కరూ పసిడిని ధరించాలని కోరుకుంటారు. అందుకే ఎంతోకొంత మిగలితే బంగారం కొనుక్కుందామనుకుంటారు. చిన్నా చితకా ఆభరణం చేయించుకుని మురిసిపోతుంటారు. గత కొంతకాలంగా బంగారంపై సామాన్యుల ఆశలు ఆవిరైపోతున్నాయి. అందుకు కారణం అసాధారణంగా పెరుగుతున్న పసిడి ధరలే! గడిచిన వారం రోజుల్లో పరిస్థితి మరింత మారిపోయింది. శ్రావణ మాసం ముగిసిన బంగారం ధరలు పెరుగుతుండడంతో ఆభరణాలు కొనుగోలుకు ప్రజలు వెనకడుగు వేస్తున్నారు.



వారంలో 10 శాతం పెరుగుదల

సరిగ్గా వారం రోజుల్లో బంగారం ధర 10 శాతం పెరిగింది. వారం రోజుల క్రితం వరకూ రిటైల్ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం ఒక గ్రాము రూ.10వేలు ఉండగా ప్రస్తుతం రూ.11వేల మార్కును దాటింది. బులియన్ మార్కెట్లో వారం రోజుల క్రితం వరకూ లక్ష రూపాయలు ఉన్న 10 గ్రాముల బంగారం ధర శుక్రవారం నాటికి రూ. లక్షా 11 వేల మార్కును చేరింది. 22 క్యారెట్ల బంగారం ధర గ్రాము రూ.10,150, 10 గ్రాములు రూ. లక్షా 1,500లు పలుకుతోంది. బంగారంతో పాటు వెండి ధర కూడా అనూహ్యంగా పెరుగుతోంది. ప్రస్తుతం కిలో వెండి ధర కూడా 1.28 లక్షలకు చేరువయింది. బంగారం అండర్ సేల్‌లో చూసుకున్నా రూ.1.09 లక్షలకు తక్కువకు బంగారం దొరకడం లేదు. దీంతో చాలా మంది బంగారం జోలికి వెళ్లడానికి భయపడుతున్నారు.

20 నెలల్లో రెట్టింపు..

వాస్తవానికి 2023 చివరి నాటికి గ్రాము 24 క్యారెట్ల బంగారం ధర రూ.6 వేలుగా ఉండేది. 2024 సార్వత్రిక ఎన్నికల సమయానికి 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.75వేలకు చేరింది. జూలైలో కేంద్ర బడ్జెట్ పుణ్యమా అని బంగారం ధర ఒక్కసారిగా రూ.70 వేలకు తగ్గింది. మళ్లీ ఆగస్టు వచ్చే నాటికి రూ.75వేలకు పెరిగింది. ఏడాది తిరిగే సరికి ఆ ధర రూ.లక్షా 11 వేలకు చేరింది. 20 నెలల కాలంలోనే ఇలా రెట్టింపు ధర పెరగడంతో బంగారం జన సామాన్యానికి దూరమవుతూ వస్తోంది.

అంతర్జాతీయ పరిణామాలే కారణం

బంగారం ధరలు భారీగా పెరగడానికి అంతర్జాతీయంగా నెలకొన్నటువంటి పరిస్థితులు ప్రధాన కారణంగా చెబుతున్నారు. స్టాక్ మార్కెట్లలో నష్టాలు నెలకొన్న నేపథ్యంలో బంగారం ధరలు అమాంతం పెరిగాయని అంటున్నారు. స్టాక్ మార్కెట్లు నష్టాల్లో ఉండడంతో మదుపర్లు బంగారంపై పెట్టుబడులు పెడుతున్నారని, ఆ కారణంగా బంగారం ధర పెరుగుతోందని అంటున్నారు. దీనికి తోడు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ నిర్ణయాలు కూడా బంగారం ధరపై ప్రభావం చూపుతున్నాయి. అంతర్జాతీయంగా గమనించినట్లయితే బంగారం ధరలు అమెరికా గోల్డ్ ఫ్యూచర్స్ మార్కెట్లో ఒక ఔన్స్ బంగారం ధర 3,579 డాలర్లకు చేరుకుంది. మరోవైపు డాలర్ ధర కూడా పడిపోతుండడంతో బంగారం ధరకు కాళ్లు వచ్చినట్లు తెలుస్తోంది. పెద్ద పెద్ద పెట్టుబడిదారులంతా తమ నగదును బంగారం రూపంలోకి మార్చుకుంటుండడంతో బంగారం మొత్తం ఒకే చోట పోగుపడుతోందన్న విమర్శలు కూడా వినిపిస్తున్నారు. ఈ పరిణామాలన్నింటి నేపథ్యంలో ప్రస్తుతం బంగారం ధర ఆల్ టైం రికార్డ్ స్థాయికి చేరింది. ఈ పెరుగుదల ఎంతవరకూ ఉంటుంది, ఎప్పుడు ఆగుతుంది అనేది తెలియడం లేదు.

ఆభరణాలపై సన్నగిల్లిన ఆశలు

ధర అనూహ్యంగా పెరుగుతుండడంతో సామాన్యులు ఎవరూ బంగారు ఆభరణాల జోలికి వెళ్లడం లేదు. పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాల్లో సైతం లాంఛనంగా ఇచ్చిపుచ్చుకునే బంగారు ఆభరణాల వ్యయాన్ని తగ్గించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. గతంలో పెళ్లిళ్లలో వధూవరులకు చైన్లు, కంఠాభరణాలు చేయించేవారు. ఇప్పుడు ఉంగరాలతో సరిపుచ్చుకుని, లాంఛనాలన్నీ నగదు రూపంలోనే చెల్లించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో స్వర్ణకారులకు పని తగ్గిపోయింది. ధరలు స్థిరపడితే కొంతమేర పనులు పెరిగే అవకాశం ఉంటుందని అంటున్నారు. కిందటి నెల శ్రావణ మాసం అయినప్పటికీ బంగారు ఆభరణాలు చేయించుకున్నవారు చాలా పరిమితంగా ఉన్నారని స్వర్ణకారులు చెబుతున్నారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో మంగళగిరి, తెనాలి, విజయవాడ తదితర ప్రాంతాల్లో స్వర్ణకార వృత్తి చేసుకునే వేలాది మంది జీవనోపాధి కోల్పోయే పరిస్థితులు నెలకొన్నాయి.



నీల కంఠం..చుట్టూ నీళ్లు..!

దాచేపల్లి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కృష్ణా నది పర వళ్లు తొక్కుతోంది. తీర ంలోని లోతట్టు ప్రాంతాలు, పంట పొలాలను ముంచెత్తుతోంది. పనిలో పనిగా నది ఒడ్డున ఉన్న పరమేశ్వరుడిని ఆక్రమించేసింది. మండలంలోని కాట్రపాడు గ్రామ సమీపంలో కృష్ణా నది పుష్కరాల సమయంలో పుష్కర్ ఘాట్ నిర్మించారు. పరమేశ్వరుడి విగ్రహాన్ని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రతిష్ఠించారు. నాగార్జున సాగర్ డ్యాం నుంచి విడుదలైన వరద నీరు, పులిచింతల డ్యామ్ బ్యాక్ వాటర్‌తో ఒడ్డున ఉన్న శివయ్య నీల కంఠం వరకు నీళ్లొచ్చాయి. ఈ చిత్రాన్ని స్థానికులు తన మొబైల్ ఫోన్లలో బంధించి.. సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేస్తున్నారు.

పీ-4 ఫలించింది.. వృద్ధురాలి ఇంటికి పునాది పడింది



నాగేశ్వరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న పీడీ బండారు శివలింగం

పిడుగురాళ్ల/రాజుపాలెం, సెప్టెంబరు5(ఆంధ్రజ్యోతి): పీ-4 పథకంతో ఎస్సీ సామాజికవర్గానికి చెందిన ఓ వితంతు మహిళకు గృహం మంజూరైంది. రాజుపాలెం మండలం నెమలిపురి గ్రామానికి చెందిన మొండితోక నాగేశ్వరమ్మ ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని అదే గ్రామానికి చెందిన టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య దృష్టికి తీసుకెళ్లింది. స్పందించిన రామయ్య నాగేశ్వరమ్మకు పీ-4 పథకంతో గృహం మంజూరు చేయాలని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబుకు లేఖరాశారు. దీంతో స్పందించిన కలెక్టర్.. నాగేశ్వరమ్మకు గృహాన్ని మంజూరు చేశారు. శుక్రవారం పల్నాడు జిల్లా గృహ నిర్మాణశాఖ పీడీ బండారు శివలింగం నెమలిపురి ఎస్సీ కాలనీలో నాగేశ్వరమ్మ గృహనిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సత్తెనపల్లి డీఈ వెన్నపూస శ్రీనివాసరెడ్డి, రాజుపాలెం, బెల్లంకొండ హౌసింగ్ ఏఈలు చంద్రశేఖర్, జోగారావు పాల్గొన్నారు.

ఎరువులు ఏమవుతున్నాయ్..

(5వ పేజీ తరువాయి)

అధికారులు చెప్పారు. అయితే ఇప్పటికీ యూరియా వెతలు వెంటాడుతూనే ఉన్నాయి. సీజన్ మొత్తానికి కావాల్సిన ఎరువుల్లో ఇప్పటికే 60 శాతం పంపిణీ జరిగినట్లు మార్క్‌ఫెడ్ చెబుతోంది. మొత్తం విస్తీర్ణంలో 70 శాతం సాగు కూడా ఇంకా పట్టాలెక్కలేదని ఈ-క్రాప్ లెక్కలే చెబుతున్నాయి. గుంటూరు జిల్లాలో 5125, పల్నాడులో 9132, బాపట్లలో 6789 టన్నుల యూరియా నిల్వలు అందుబాట్లో ఉన్నట్లు అధికారులు చెప్తున్నారు. అయితే యూరియా కోసం ఇక్కట్లు ఎందుకు వచ్చాయనే దానికి అధికారుల నుంచి సమాధానం లేదు. ఇప్పుడు తెచ్చుకోకపోతే యూరియా ఇక బయట దొరకదు అనే విధంగా తప్పుడు ప్రచారం జరగడం, దానిని నమ్మడం కూడా ప్రస్తుత పరిస్థితికి ఓ కారణంగా ఉంది. యూరియా పంపిణీలో రాజకీయ జోక్యం కూడా రైతుల ఇక్కట్లుకు ఒక కారణంగా పలువురు ఆరోపిస్తున్నారు. దీనికి తోడు డీలర్లతో కొంతమంది ఉద్యోగులు కుమ్మక్కు కావడంతో బ్లాక్ మార్కెట్‌కు యూరియా తరలినట్లు తెలుస్తోంది. నిబంధనల ప్రకారం పంపిణీపై అధికారులు దృష్టి పెట్టకపోవడం కూడా సమస్య తీవ్రతరం కావడానికి కారణంగా కనబడుతోంది.

పంపిణీపై లెక్కలేవీ..

ఇప్పటి వరకు గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో 18 వేల నుంచి 20 వేల టన్నుల యూరియా సొసైటీల్లో పంపిణీ జరిగినట్లు మార్క్‌ఫెడ్ చెబుతోంది. కానీ ఇందుకు సంబంధించి ఏయే సొసైటీల్లో ఎంతమంది రైతులకు ఇచ్చారనే లెక్కలు కొరవడ్డాయి. ఇక్కడే చాలావరకు పక్కదారి పట్టాయని రైతులు ఆరోపిస్తున్నారు. నేతలు చెప్పినవారికే భారీ యూరియా నిల్వలు



పొందుగుల చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేస్తున్న కలెక్టర్ అరుణ్ బాబు, ఎస్పీ శ్రీనివాసరావు

తరలించారని, దీంతో చిన్న, సన్నకారు రైతులకు అన్యాయం జరిగిందని వాపోతున్నారు. ఇదిలా ఉంటే ప్రారంభంలో యూరియా పంపిణీ విషయంలో లెక్కాపత్రాలేవీ లేకుండానే ఒక్కొక్కరికి 30 నుంచి 50 బస్తాల వరకు ఇవ్వడం కూడా ప్రస్తుత దుస్థితికి కారణంగా కనిపిస్తుంది. ప్రభుత్వం భారీ స్థాయిలో యూరియా కేటాయించినట్లు గణాంకాలు ధ్రువీకరిస్తుండగా, కొద్దిమంది వద్దకే ఆ నిల్వలు చేరడమే ఈ కటకటకు కారణంగా ఉంది. యూరియా విషయంలో ఇలాంటి పరిస్థితి వస్తుందని అంచనా వేయలేకపోయిన అధికారులు ప్రారంభంలో పంపిణీని పట్టించుకోలేదు. స్థానికంగా ఉండే నేతల మీదనే వదిలేశారు. దీంతో వారు దీనిని అవకాశంగా చేసుకుని సొమ్ము చేసుకున్నట్లు తెలుస్తోంది. శాస్త్రీయంగా చూస్తే ఎకరానికి ఇప్పటి వరకు రెండు యూరియా బస్తాలను రెండు దఫాలుగా రైతులకు ఇవ్వాల్సి ఉంది. ఈ నెలాఖరుకు ఇంకోసారి నిబంధనల ప్రకారం అందించాలి. అది కూడా సదరు రైతు తంబ్ వేయించుకున్నాకే. కానీ వీటిని వదిలేసి ఒక్కొక్కరికి రెండు టన్నులు కూడా ఇచ్చారని, ఇదే సమయంలో బ్లాక్ మార్కెట్‌కు కొంత తరలించడంతో అందరి ప్రయోజనం కాస్తా కొద్ది మందికే పరిమితమైనట్లు తెలుస్తోంది.

సమన్వయ లోపం కూడా కారణమే...

యూరియా ఇక్కట్లకు సంబంధించిన సంకేతాలు దాదాపు మూడు వారాల క్రితమే కనిపించాయి. అప్పుడే అప్రమత్తమవ్వాల్సిన అధికారులు ఉదాసీనంగా వ్యవహరించారు. అందువల్లే ఇప్పుడు పరిస్థితి తీవ్రతరమైందని తెలుస్తోంది. వ్యవసాయశాఖ, మార్క్‌ఫెడ్, విజిలెన్స్‌తో పాటు రెవెన్యూ, పోలీస్ విభాగాలు కూడా సమన్వయంతో అడుగులు వేసి ఉంటే యూరియా పక్కదారి పట్టకుండా చాలా వరకు నియంత్రించగలిగే వారు. కానీ ఆయా విభాగాల మధ్య సమాచార లోపంతో పాటు బాధ్యతల విషయంలో స్పష్టత లేకుండా వ్యవహరించడం కూడా పరిస్థితి అదుపు తప్పడానికి కారణమైందన్న విమర్శలు వస్తున్నాయి.

రైతుల మధ్య ఘర్షణలు..

యూరియా నిల్వలు వచ్చాయని తెలిస్తే ఆర్ఎస్కేలు, సొసైటీల వద్దకు రైతులు పరుగులు తీస్తున్నారు. ఈ క్రమంలో రైతుల మధ్య ఘర్షణలు కూడా చోటుచేసుకుంటున్నాయి. రేపల్లె మండలం నల్లూరుపాలెంలో ఎరువుల కోసం శుక్రవారం రైతులు ఎగబడటంతో చిన్నపాటి గొడవలు జరిగాయి. పోలీసులు దగ్గరుండి క్రమ పద్ధతిలో రైతులకు యూరియాను అందించాల్సి వచ్చింది. పలుకుబడి ఉన్నవారు ఐదు, పదికట్టలు క్యూలో నుంచో కుండా తీసుకువెళ్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. కొంత మంది దళారులు, పీఏసీఎస్ అధ్యక్షులు అధిక ధరలకు యూరియాను అమ్ముకుంటున్నారంటున్నారు.

62వ జాతీయ చదరంగం చాంపియన్‌షిప్ లోగో ఆవిష్కరణ

గుంటూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 20 నుంచి అక్టోబరు 1 వరకు గుంటూరులోని విజ్ఞాన విశ్వవిద్యాలయంలో జరగబోయే 62వ జాతీయ చదరంగం ఛాంపియన్‌షిప్-2025 లోగోని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి. శ్రీనరసింహ ఆవిష్కరించారు. శుక్రవారం ఇక్కడ జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, విశ్రాంత న్యాయమూర్తి డీవీఎస్ సోమయాజులు, డీఎస్ఎన్ఎల్‌యూ ఉపకులపతి ఆచార్య డాక్టర్ డీ సూర్యప్రకాశరావు, ఆంధ్ర చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు అడుసుమిల్లి సురేష్, సెక్రెటరి కె.జగదీష్, ముఖ్య సలహాదారు కేవీవీ శర్మ పాల్గొన్నారు.



లోగోని ఆవిష్కరిస్తున్న ఎస్‌సీ న్యాయమూర్తి శ్రీనరసింహ, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్‌సింగ్ ఠాకూర్

సుప్రభాత సేవ టికెట్లు ఇస్తానని మోసం

- రూ.70 వేలు తీసుకున్న దళారీని అదుపులోకి తీసుకున్న పోలీసులు

తిరుమల, సెప్టెంబరు5(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి సుప్రభాత సేవ టికెట్లు ఇస్తానని నమ్మించి మోసగించిన ఓ దళారీని పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. గుంటూరు జిల్లాలోని వెంగలాయపాలెంకు చెందిన హరి నాగసాయి కార్తీక్ కొన్నేళ్లుగా భక్తులను మోసగిస్తూ అందినవరకు దోచుకుంటున్నాడు. ఇటీవల ఫేస్‌బుక్‌లో 'శ్రీప్రభాకర చార్యులు' అనే నకిలీ ఖాతాను తెరిచాడు. తాను తిరుమలలో సహాయ అర్చకుడినని, బ్రేక్ దర్శనాలు, ఆర్జితసేవ టికెట్లు ఇప్పిస్తానని భక్తులను నమ్మించి మోసం చేయడం మొదలుపెట్టాడు. ఆదిత్య, హరికృష్ణ, నాగార్జున అనే మరో ముగ్గురి సహాయంతో బ్యాంకు ఖాతాలు కూడా తెరిచాడు. ఈ ముఠా తిరుపతికి చెందిన విజయ్ అనే భక్తుడికి నాలుగు సుప్రభాతసేవ టికెట్లు ఇప్పిస్తామని చెప్పి రూ.70,070 తీసుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు తిరుమల వన్‌టౌన్ ఎస్ఐలు రమేష్‌బాబు, చలపతి ప్రత్యేక నిఘా పెట్టారు. ఈ క్రమంలో శుక్రవారం తిరుమలలోని కర్ణాటక సత్రాల వద్ద కార్తీక్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్దనున్న రూ.1.03 లక్షల నగదు, సెల్‌ఫోన్‌ను స్వాధీన పరుచుకున్నారు. ఇప్పటికే కార్తీక్‌పై తిరుమల వన్‌టౌన్, టూటౌన్‌లో రెండు కేసులు, తిరుపతి ఈస్ట్‌లో మరో కేసు నమోదై ఉన్నట్టు పోలీసులు తెలిపారు. అలాగే 16 మంది ఎన్ఆర్ఐ భక్తులకు అభిషేకం టికెట్లు ఇప్పిస్తానని నమ్మించి రూ.36 లక్షలు తీసుకుని మోసం చేసిన ఘటనలో జైలుకు వెళ్లి.. బెయిల్‌పై వచ్చిన కార్తీక్.. మళ్లీ భక్తులను మోసగించడం మొదలు పెట్టాడని పోలీసులు తెలిపారు.



సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ నుంచి అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయుడు డాక్టర్.జె.ప్రతాప్, తిమ్మాయిపాలెం జడ్పీ, బాపట్ల

మాస్టార్లకు ఘన సత్కారం

గురువులకే గురువు సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం విజయవాడలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, అధ్యాపకులను ఘనంగా సత్కరించారు. ప్రభుత్వం 175 మందిని రాష్ట్రస్థాయి ఉత్తమ టీచర్లుగా గుర్తించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్‌లు పేరుపేరునా సత్కరించారు. విద్యాశాఖలో 78 మంది ఉపాధ్యాయులు, ఇంటర్మీడియట్‌లో 26 మంది జూనియర్ లెక్చరర్లు, ఉన్నత విద్యలో 56 మంది ప్రొఫెసర్లు, డిగ్రీ లెక్చరర్లు, పాలిటెక్నిక్ కాలేజీల్లో 15 మంది లెక్చరర్లను ఉత్తమ టీచర్లుగా గుర్తించి అవార్డులు ప్రదానం చేశారు.

- అమరావతి



కె.మోహనాంజలి, మక్కెనవారిపాలెం జడ్పీ బాపట్ల



ఎం.ధనలక్ష్మి, ఎంపీయూపీ అద్దంకి



బి.శివకుమారి, నకరికల్లు జెడ్పీహెచ్ఎస్



ఎం.పార్వతి, ఎస్‌బీపురం జడ్పీ హెచ్ఎస్



సునీత రాణి, ఎస్ఎస్ఎన్ఓ, గుంటూరు



జి.సుశీల మాధవి, పీఎంసీ హెచ్ఎస్, గుంటూరు



డాక్టర్.ఎ.భద్రావతి ఎంపీపీ మోడల్ చెల్లిపాలెం



బి.లక్ష్మణరావు, జీజేసీ, చేబ్రోలు



ఎ.లక్ష్మీదేవి, జీపీసీ, దుర్గి



ఎ.లావణ్య, ఎస్ఎం జీపీసీ(జి), బాపట్ల



సీహెచ్ మోసెస్ అరవింద్, ఎంబీటీఎస్ పాలిటెక్నిక్



ఆర్.ప్రకాశరావు, ఎంబీటీఎస్ పాలిటెక్నిక్



వి.నగేష్‌బాబు, పాలిటెక్నిక్, పొన్నూరు



ప్రొ.సూర్యదేవర విద్యాధర, చేబ్రోలు హనుమయ్య, ఫార్మసీ



ప్రొ.పి.శ్రీనివాసబాబు, విజ్ఞాన్ ఫార్మసీ



ప్రొ. తలశిల ఈశ్వర గోపాల కృష్ణమూర్తి, బాపట్ల ఫార్మసీ



డాక్టర్. పి.హేమలత, జేఎంజే కాలేజ్ ఉమెన్స్



ప్రొ.గుజ్జు చెన్నారెడ్డి, ఏఎన్‌యూ



ప్రొ.పిపిఎస్.పాల్ కుమార్,ఏఎన్‌యూ



ప్రొ.వి.దివ్యతేజో మూర్తి, ఏఎన్‌యూ



డాక్టర్ పి. సుధాకర్,ఏఎన్‌యూ



ప్రొ.ఆర్.రమేష్‌రాజు, ఏఎన్‌యూ



ప్రొ.కె.జయలలిత, ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రి వర్సిటీ



ప్రొ.లాల్ అహ్మద్ మొహ్మద్, ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రి వర్సిటీ



ప్రొ డి.సుబ్రహ్మణ్యం, ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రి వర్సిటీ



వై.రాజ్యలక్ష్మి, ఎంపీపీఎస్, కనపర్రు

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

వీవీఐటీని సందర్శించిన జర్మనీ బృందం


యూనివర్సిటీకి వచ్చిన జర్మనీ బృందం

పెదకాకాని, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జర్మనీలోని అతి పెద్ద నైపుణ్య శిక్షణా సంస్థ డెక్రా ఆకాడమీ ప్రతినిధులు వీవీ ఐటీ యూనివర్సిటీని శుక్రవారం సందర్శించారు. రాష్ట్ర నైపుణ్య కార్యక్రమాలను మెరుగుపరచడానికి, యువతకు ప్రపంచ ఉపాధి అవకాశాలను సులభతరం చేసేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు (అంతర్జాతీయ నైపుణ్య, ఉద్యోగ కల్పన) సీతాశర్మతో కలసి ఈ బృందం సందర్శించింది. వీవీఐటీ విశ్వవిద్యాలయంలోని సీమన్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రాన్ని సందర్శించి, ఈ బృందానికి విద్యార్థులకు అందించే శిక్షణ గురించి సీమన్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ డైరెక్టర్ డాక్టర్ రావెల నవీన్ వివరించారు. ఈ సందర్భంగా సీతాశర్మ మాట్లాడుతూ జర్మనీ ప్రస్తుతం నైపుణ్యం గల నిపుణుల కొరతను ఎదుర్కొంటున్నదనీ, నిర్మాణం, ఇంజనీరింగ్, సమాచార సాంకేతిక రంగాలలో పెద్ద సంఖ్యలో ఉద్యోగ నియామక అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఇండో జర్మన్ సమిష్టి కృషితో యువతలో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించి పరిశ్రమ అవసరాలకు తగ్గట్టు శిక్షణను అందించడం ద్వారా అంతర్జాతీయ నియామకాలు అందించవచ్చని పేర్కొన్నారు.

రాష్ట్రంలో ఎక్కడైనా రేషన్ తీసుకోవచ్చు

● రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్


కొల్లిపర: మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్


తెనాలి: ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి మనోహర్

కొల్లిపర, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ రేషన్‌కార్డుతో రాష్ట్రంలో ఎక్కడైనా లబ్ధిదారులు రేషన్ తీసుకోవచ్చునని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రం కొల్లిపరలో స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ఇంటింటికి తిరిగి స్మార్ట్ రేషన్‌కార్డులను పంపిణీ చేస్తూ ప్రతి ఒక్కరిని తల్లివందనం అందిందా, దీపం పథకం ద్వారా గ్యాస్ పొందారా.. ఉచిత బస్సును సద్వినియోగించుకుంటున్నారా అని అడిగి తెలుసుకున్నారు. రైతులను అన్నదాత సుఖీభవ పథకం ద్వారా నగదు బ్యాంకులో జమ అయ్యిందా అని అడిగారు. అనంతరం తహసీల్దార్ సిద్ధార్థ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మనోహర్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుని పరిపాలన కొనసాగిస్తోందన్నారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు పేద ప్రజలను అన్నివిధాలా ఆదుకోవడమే ధ్యేయంగా పెట్టుకున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో తొలిసారిగా క్యూ ఆర్ కోడ్ కలిగిన రేషన్ కార్డులను అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. వృద్ధాప్యంలో ఉన్న వారికి వారి ఇంటి వద్దకే రేషన్ సరుకులను అందిస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 4కోట్ల 42లక్షల మందికి స్మార్ట్ రేషన్‌కార్డుల్లో సభ్యులుగా చేర్చినట్లు తెలిపారు. జిల్లాలో 5లక్షల 85వేల మందికి క్యూఆర్‌కోడ్ ద్వారా స్మార్ట్ రేషన్ కార్డులు అందించడం జరుగుతుందన్నారు. దీపం పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 2కోట్ల 45లక్షల సిలెండర్‌లను ఉచితంగా ఇవ్వడం జరిగిందన్నారు. అదే విధంగా మహిళల కోసం స్త్రీశక్తి పథకాన్ని తీసుకువచ్చామని తద్వారా రాష్ట్రంలో ఎక్కడికైన ఉచితంగా ఆర్టీసీ బస్సులు ద్వారా ప్రయాణం చేయవచ్చునన్నారు. గత సంవత్సరం రైతుల దగ్గర ధాన్యాన్ని కొనుగోలు చేసి వారికి 48 గంటలలోపు వారి ఖాతాలో జమచేయడం జరిగిందన్నారు. అన్నదాత సుఖీభవ ద్వారా రైతుల ఖాతాల్లో నగదును కూడా జమ చేసినట్లు తెలియజేశారు. రానున్న ఖరీఫ్‌లో 50లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని కొనుగోలు చేయటానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. సమావేశంలో ఎంపీడీవో విజయలక్ష్మి, ఎంపీపీ భీమవరపు పద్మావతి, సర్పంచ్ పిల్లి రాధిక, నాయకులు అడపా నారాయణరెడ్డి, యర్రు వెంకయ్యనాయుడు, భీమవరపు కిశోర్‌రెడ్డి, కట్టా శ్రీహరిరెడ్డి, అద్దంకి వేణుగోపాల్, చౌడేశ్వరరావు, వివిధ శాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ విజ్ఞప్తిని పరిశీలించి న్యాయం చేస్తాం

తెనాలి అర్బన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చిన ప్రతి విజ్ఞప్తిని పరిశీలించి వారికి తగిన న్యాయం చేస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. బోసురోడ్డులోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వికలాంగులు, మహిళలు, విద్యార్థులు తదితర వర్గాల ప్రజలు సమస్యలు వివరించి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వ పాలనలో అన్నివర్గాల సంక్షేమం దృష్టిలో పెట్టుకుంటామన్నారు. నియోజకవర్గంలో వైద్య సాయం కోసం దరఖాస్తు చేసిన ప్రతి ఒక్కరికి సీఎం సహాయ నిధి నుండి ఆర్థిక సాయం మంజూరు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.


నూతన స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

స్మార్ట్ కార్డులతో రేషన్ అక్రమాలకు చెక్

● ఎమ్మెల్యే ధూళిపాళ్ళ

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నూతన స్మార్ట్ రేషన్ కార్డులతో రేషన్ అక్రమాలకు చెక్ పడనున్నదని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. మండల పరిధిలోని పచ్చలతాడిపర్రులో శుక్రవారం నూతన రేషన్ కార్డులు మంజూరైన లబ్ధిదారులకు ఎమ్మెల్యే కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేయడం ద్వారా సంక్షేమ పథకాలపై బొమ్మలు వేసుకునే సంస్కృతిని తొలగించామని తెలిపారు. సంక్షేమ పథకాల కార్డులపై ఇక నుంచి కేవలం లబ్ధిదారుల వివరాలు మాత్రమే ఉంటాయని స్పష్టం చేశారు. అర్హత ఉన్న లబ్ధిదారులకు ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యంగా చెప్పారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా లబ్ధిదారులు నేరుగా రేషన్ దుకాణానికి వెళ్లి అందులో ఉన్న క్యూఆర్ కోడ్ ద్వారా రేషన్ సులువుగా పొందవచ్చని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో తాజాగా కొత్తగా నియోజకవర్గంలో 2280 రేషన్ కార్డులు మంజూరు చేసినట్లు చెప్పారు. కానీ వైసీపీ హయాంలో అడ్డగోలు నిబంధనలు విధించి పేదలకు రేషన్ కార్డులు తొలగించి అనేక రకాలుగా ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ అర్బన్ కార్పొరేషన్ డెవలప్‌మెంట్ డైరెక్టర్, జనసేన సమన్వయకర్త వడ్రాణం మార్కండేయ బాబు కూటమి పార్టీల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పార్కులను పరిశుభ్రంగా ఉంచాలి

● కమిషనర్ ముప్పాళ్ళ రమేష్ బాబు


అంబేద్కర్ పార్కులో పిచ్చిచెట్లు తొలగింపును పరిశీలిస్తున్న కమిషనర్ రమేష్‌బాబు

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలోని పార్కులను ప్రతిరోజు పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ పారిశుధ్య సిబ్బందికి కమిషనర్ ముప్పాళ్ళ రమేష్ బాబు ఆదేశించారు. పట్టణంలోని పాత పొన్నూరు అంబేద్కర్ పార్క్, నిడుబ్రోలులోని పెద్దన్న పార్కులను శుక్రవారం కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పార్కుల్లో ఉన్న గడ్డి, పిచ్చిచెట్లను దగ్గరుండి తొలగింపజేశారు. ఈ సందర్భంగా సిబ్బందితో ఆయన మాట్లాడుతూ ప్రజలు పార్కులను కేవలం కాలక్షేపం కోసం మాత్రమే కాకుండా కుటుంబసభ్యులతో సంతోషంగా గడిపేందుకు వస్తారన్నారు. ప్రజలు పార్కులకు వచ్చిన సందర్భంలో అపరిశుభ్రంగా ఉంటే అసౌకర్యానికి గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. పట్టణంలోని ప్రజలకు ఆదర్శంతమైన ప్రదేశాలుగా పార్కులను తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, పారిశుధ్యసిబ్బంది పాల్గొన్నారు.

చెరువు కట్టకు మరమ్మతులు చేపట్టాలి

● సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ

పెదకాకాని, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పెదకాకానిలోని చెరువు గట్టులకు మరమ్మతులు చేపట్టాలని సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ డిమాండ్ చేశారు. పెదకాకానిలో శుక్రవారం సీపీఎం శాఖ నిర్వహించిన సమావేశానికి బాబురావు అధ్యక్షత వహించారు. నన్నపనేని శివాజీ మాట్లాడుతూ పెదకాకానిలో గత నెల 13వ తేదీన కురిసిన భారీ వర్షాలకు తాగునీటి చెరువు, మురుగు నీరు చెరువుకు మధ్య ఉన్న కట్ట తెగి తాగునీటి చెరువులోకి మురుగునీరు చేరి కలుషితమైందన్నారు. మంచినీటి చెరువులో ఉన్న మురుగునీటిని తొలగించి చెరువును ఎండబెట్టి చెరువును మంచినీటితో నింపాలని శివాజీ డిమాండ్ చేశారు. గతంలో చెరువు కట్ట పనులు నాసిరకంగా జరిగాయని కాంట్రాక్టర్లు నామమాత్రంగా పనిచేసి బిల్లులు చేసుకున్నాడని, చెరువుకట్ట నాసిరకంగా ఉండటం వల్ల వర్షానికి కట్ట తెగిపోయిందన్నారు. రెండు నెలల నుంచి గ్రామంలో తాగునీరు సరిగా రావడం లేదని, మురుగునీరు కారణంగా ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. సమస్య తీవ్రంగా ఉన్నా పంచాయతీ అధికారులు, ఆర్ డబ్ల్యూఎస్ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవటం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఉల్లంగుల శివయ్య, కే సత్యనారాయణ, ఎస్ నీలాంబరం, బి.సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ అనుబంధ సంఘాల నాయకుల నియామకం

తెనాలి అర్బన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అనుబంధ సంఘాలకు నాయకులను నియమించారు. నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా ఉన్నవ అనీష్, బీసీ సెల్ అధ్యక్షుడిగా మోర్ల శ్రీను, వలంటీర్ విభాగం అధ్యక్షుడిగా రత్నబాబు, ఐటీ విభాగం అధ్యక్షుడిగా పఠాన్ అసద్‌లను నియమించారు. ప్రకాశం రోడ్డులోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు వారిని సత్కరించారు. నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి పాటుపడతామని చెప్పారు. మండల పార్టీ అధ్యక్షుడు వెంకటప్పారెడ్డి, సంజీవరెడ్డి, సుధాకరరెడ్డి, కిరణ్, జశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

శ్రీమహాత్మా సేవా శాంతి ఆశ్రమంలో శుక్రవారం వృద్ధులకు అన్నదానం చేశారు. న్యాయవాది సంకా శ్రీధర్ 20వ వర్ధంతి సంద్బంగా ఈ అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో వజ్జాల రామలింగాచారి, సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక సమాజంలో పెరిగిన ఉపాధ్యాయుల బాధ్యత

● విశ్వసాహితీ కళావేదిక గౌరవ అధ్యక్షుడు రంగిశెట్టి రమేష్

తెనాలి అర్బన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సమాజంలో ఉపాధ్యాయుల బాధ్యత మరింతగా పెరిగిందని విశ్వసాహితీ కళావేదిక గౌరవ అధ్యక్షుడు రంగిశెట్టి రమేష్ చెప్పారు. వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం నాజరుపేటలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సామాజిక మాధ్యమాల ప్రభావం, సెల్‌ఫోన్ వినియోగం, విద్యార్థులలో ఎక్కువైందని, దీంతో పాఠశాలల్లో సమస్యలు ఎక్కువ అవుతున్నాయన్నారు. విద్యార్థులను సరైన గాడిలో పెట్టడానికి సంస్థలు, అధికారులు, తల్లిదండ్రులు ఆలోచించాల్సిన సమయం వచ్చిందన్నారు. వేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు రమావతి, ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు, విజయసారథి, సుబ్రహ్మణ్య కవి, శ్రీరామమూర్తి, సుజాత ప్రసంగించారు. ఉత్తమ ఉపాధ్యాయుడు ఎంవీ రఘునాథరావు, సీఆర్పీ శ్రీదేవిలను సన్మానించారు.


ప్రసాద్‌ను సత్కరిస్తున్న సిబార్ కళాశాల డీన్ డాక్టర్ కృష్ణ ప్రసాద్, అధ్యాపకులు తదితరులు


చేబ్రోలు: సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయులు


పొన్నూరు: అవార్డు అందుకుంటున్న లాజర్‌బాబు


తెనాలి: రాధాకృష్ణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వేదిక సభ్యులు

సిబార్ దంత వైద్య కళాశాలలో...

పెదకాకాని, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): సిబార్ దంత వైద్య కళాశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా టీచర్స్ డే కార్యక్రమం శుక్రవారం ఎంతో వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కళాశాల డీన్ డాక్టర్ ఎల్.కృష్ణప్రసాద్‌కు గురువులు, జువాలజీ అధ్యాపకులు, శారద ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ అడ్వైజర్ ఈఎస్ఆర్కే ప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమణారెడ్డి గురువు రాగాస్ డెంటల్ కాలేజి ఓరల్ పెథాలజీ విభాగపు హెచ్‌వోడీ, డాక్టర్ రంగనాథన్ కన్నన్‌లు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈఎస్ఆర్కే ప్రసాద్ తన అనుభవాలను సిబార్ కళాశాలలోని విద్యార్థులతో పంచుకున్నారు. మరో ముఖ్య అతిథి డాక్టర్ రంగనాథన్ కన్నన్ మాట్లాడుతూ విద్యార్థులు అకుంఠిత దీక్షతో తమ గురువులు చెప్పిన విధానాలను పాటించినట్లయితే వారికి జీవితంలో ఎన్నో విజయాలు కలుగుతాయన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులను సిబార్ దంత వైద్య కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించారు. టీచర్స్ డే సందర్భంగా సిబార్ దంత వైద్య కళాశాల యాజమాన్యం కళాశాలలో విశిష్ట సేవలు అందించిన, దేశంలోని స్పెషాలిటీ అసోసియేషన్స్‌లోని పాలకమండలిలో విశిష్టస్థానం పొందిన అధ్యాపకులను ప్రశంసాపత్రాలతో సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల వ్యవస్థాపక డైరెక్టర్ ఎల్. సుబ్బారావు, డైరెక్టర్ టి.కృష్ణమోహన్, వైస్‌డీన్ డాక్టర్ మన్నే ప్రకాష్, డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మెంబర్ డాక్టర్ పి.రేవతి, అధ్యాపకులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

● తెనాలి అర్బన్: ఉపాధ్యాయ దినోత్సవంను పురస్కరించుకుని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు. గుర్రం జాషువా విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రవికుమార్, రాజారామ్, రమేష్, రత్న, పాల్‌రాజ్, డేవిడ్‌పాల్ పాల్గొన్నారు.

● చేబ్రోలు: ఆర్‌వీ ఐటీ చేబ్రోలులో ఉపాధ్యా య దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్‌వీ కృష్ణయ్య ప్రసంగిస్తూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గారు విద్యారంగానికి ఆయన చేసిన కృషి ఎనలేనిదన్నారు. నేటి తరం ఉపాధ్యాయులు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

● తెనాలి అర్బన్: పాఠశాల అభివృద్ధితో పాటు విద్యార్థులకు ఉత్తమ బోధన అందించేలా పనిచేయడం అభినందనీయమని లయన్స్ క్లబ్ వ్యవస్థాపకుడు కాకరపర్తి సుబ్రహ్మణ్యం చెప్పారు. లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి స్నేహ ఆధ్వర్యంలో శుక్రవారం మారీసుపేట మున్సిపల్ హైస్కూల్ ఉపాధ్యాయురాలు ఆర్.సంపూర్ణను సన్మానించారు. ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ, విద్యార్థులు పెడదోవ పట్టకుండా తల్లిదండ్రులు, సమాజంపై కూడా బాధ్యత ఉందన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు వృత్తి పట్ల అంకితభావంతో పని చేయాలని, ప్రతి పాఠశాలలో విద్యార్థులపరంగా ఎదురవుతున్న సవాళ్లను అధిగమించేందుకు తల్లిదండ్రులు, సమాజ భాగస్వామ్యంతో తగిన పరిష్కారాలను కనుగొనాలని చెప్పారు. క్లబ్ అధ్యక్షుడు కృష్ణమోహనరావు, రాంప్రసాద్, పల్లవి, చిన్నకృష్ణారెడ్డి, మల్లేశ్వరరావు, రమేష్‌కృష్ణ పాల్గొన్నారు.

● పొన్నూరు టౌన్: పొన్నూరులోని నేతాజీనగర్ మున్సిపల్ హైస్కూల్‌కి చెందిన ప్రధానోపాధ్యాయుడు కాకుమాను లాజర్‌బాబు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని శుక్రవారం అందుకున్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని గుంటూరు రెవెన్యూ కల్యాణ మండపంలో లాజర్ బాబును జిల్లా పరిషత్ చైర్మన్ హెనీ క్రిస్టీనా, జిల్లా విద్యాశాఖ అధికారి సీవీ రేణుక అవార్డు అందజేసి సత్కరించారు. లాజర్ బాబు గత పదో తరగతి పరీక్షా ఫలితాల్లో నూరు శాతం ఫలితాలు సాధించడమే కాకుండా, పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచడం, సీసీ కెమెరాలు ఏర్పాటు, పాఠశాలకు చెందిన విద్యార్థి రాష్ట్ర గవర్నర్ అవార్డు పొందేటట్లు చేయటం, దాతల సహకారంతో వనరుల పెంపు వంటి కార్యక్రమాలను చేపట్టారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు లాజర్ బాబు పొందటంపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది.

కొలిక్కి వచ్చిన అర్బన్ బ్యాంకు ఎన్నిక వ్యవహారం


కేంద్ర మంత్రి పెమ్మసానిని కలిసిన ఎమ్మెల్సీ ఆలపాటి, టీడీపీ నేతలు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తెనాలి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ఎన్నిక వ్యవహారం ఓ కొలిక్కి వచ్చింది. బ్యాంకు అధ్యక్షుడిగా మంగమూరి హరిప్రసాద్ ఎన్నిక ఏకగ్రీవం చేసేందుకు ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ నిర్ణయించారు. అయితే కూటమిలోని జనసేనతో పాటు టీడీపీ నాయకులు గుమ్మడి రమేష్ కూడా పదవులు ఆశించారు. దీంతో ఏకగ్రీవం అయ్యే ఎన్నిక పోటీ పడే అనివార్య పరిస్థితులు తలెత్తాయి. నాయకుల మధ్య సర్దుబాటు చేసేందుకు ఎమ్మెల్సీ ఆలపాటి, కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్‌తో చర్చించారు. దీంతో పోటీపడే వారికి కూడా డైరెక్టర్ పదవులు ఇచ్చి ఏకగ్రీవం చేసేలా చర్చలు ఫలించాయి. ఈ నెల 7న నామినేషన్లు స్వీకరించి పరిశీలన, ఉపసంహరణ అనంతరం తుది జాబితా ప్రకటిస్తారు.


ర్యాలీలో పాల్గొన్న మాలలు

వర్గీకరణకు వ్యతిరేకంగా మాలల రాజ్యాంగ పరిరక్షణ యాత్ర

తెనాలి అర్బన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలల ఉద్యోగుల సంక్షేమ సంఘం, మాలల జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. జేఏసీ ఆధ్వర్యంలో ఆగస్టు 3న ప్రారంభమైన రాజ్యాంగ పరిరక్షణ యాత్ర తెనాలి చేరుకుంది. మార్కెట్ యార్డు నుంచి ఐతానగర్ వరకు జరిగిన యాత్రలో పెద్ద సంఖ్యలో ఎస్సీలు పాల్గొన్నారు. మాల ఉద్యోగుల సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు టి.అశోక్‌బాబుకు మార్కెట్ యార్డు దగ్గర స్వాగతం పలికారు. అంబేద్కర్ ఆలోచన విధానాలకు తూట్లు పొడుస్తూ రాజ్యాధికారం కలగానే ఉండేలా ఎస్సీలను వర్గీకరణ పేరుతో బలహీనపరుస్తున్నారని విమర్శించారు. ఎస్సీల ఐక్యత చాటేందుకు అంతా ఐక్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రైవేట్ రంగాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని, దళిత క్రైస్తవులకు రిజర్వేషన్లు ఇవ్వాలని, జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్ 20శాతం పెంచాలని, దళితులపై దాడులను అరికట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

నాటక రంగ అభివృద్ధికి కృషి చేస్తా

● అకాడమీ డైరెక్టర్ మాగంటి వెంకట సుబ్రహ్మణ్య రత్నాకరశాస్త్రి


రత్నాకరశాస్త్రి, సరస్వతిలను సన్మానిస్తున్న పరిషత్ సభ్యులు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంగీత, నాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని అకాడమీ డైరెక్టర్ మాగంటి వెంకట సుబ్రహ్మణ్య రత్నాకర శాస్త్రి చెప్పారు. రామలింగేశ్వరపేటలోని బ్రాహ్మణ సేవా సమితిలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయనను సన్మానించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా హిందీ ఉపాధ్యాయిని కరవది సరస్వతిని సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ పదవికి తనను ఎంపిక చేయడంపై బ్రాహ్మణ సేవా సమితి మంత్రి మనోజ్ కృతజ్ఞతలు తెలిపారు. సమితి అధ్యక్షుడు శ్రీనివాసప్రసాద్ మాట్లాడుతూ, ఎంతోమంది విద్యార్థులకు హిందీ భాషను నేర్పారని ఉపాధ్యాయినిని అభినందించారు. రవీంద్రబాబు, సత్యనారాయణ, దత్తు, శ్రీనివాస్, మణికిషోర్, ఫణీంద్ర, పురుషోత్తమ శర్మ పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ వేడుకలు

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలో మిలాద్ ఉన్ నబీ వేడుకలు శుక్రవారం భక్తి శ్రద్ధలతో జరిగాయి. మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా పట్టణంలోని మసీదులు, జెండా చెట్టు వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మహమ్మద్ ప్రవక్త సూత్రాలను మత గురువులు బోధించారు. మహమ్మద్ ప్రవక్త సాటివారిని గౌరవిస్తూ, ఆకలి తీర్చే పవిత్ర ఆశయాలు కొనసాగిస్తామని ప్రార్థనలు చేశారు. ప్రార్థనల అనంతరం పట్టణంలోని డఫ్‌పేటలో ఉన్న జెండా చెట్టు వద్ద ప్రత్యేక ప్రార్థనలు, 1500 మందికి అన్నప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. ముస్లిం యువత ఆధ్వర్యంలో మక్కా మసీదు ఆకారంలో ఉన్న ప్రతిమను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ప్రతిష్ఠించి పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ముస్లింలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



మక్కా మసీదు ఆకృతితో పట్టణంలో ప్రదర్శన నిర్వహిస్తున్న ముస్లింలు


చేబ్రోలు: నగదు అలంకరణలో ఉన్న వినాయకుడు

ముగిసిన మహా గణపతి నవరాత్రి ఉత్సవాలు


పెదకాకాని: ఊరేగింపును ప్రారంభిస్తున్న ఆలయ ఉప కమిషనర్ లీలాకుమార్


చేబ్రోలు: వినాయక మండపాలను దర్శించుకున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్

పెదకాకాని, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మహాగణపతిస్వామి వారికి నవరాత్రి పూజలలో భాగంగా శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా పూలతో ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై మహాగణపతిని మేళ తాళాలతో వైభవోపేతంగా పెదకాకాని పురవీధులలో గ్రామోత్సవం నిర్వహించినారు. ఆలయ ప్రాంగణంలో దేవస్థాన ఉప కమిషనర్ గోగినేని లీలాకుమార్ కొబ్బరికాయ కొట్టి గ్రామోత్సవం ప్రారంభించారు. గ్రామోత్సవం అనంతరం గొల్లమూడి కాలువలో మహాగణపతి నిమజ్జన కార్యక్రమం శాస్త్రోక్తంగా పూర్తి చేసినట్లు ఆలయ ఉప కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో భక్తులు, పెదకాకాని గ్రామ ప్రజలు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

● పొన్నూరు టౌన్: మండల పరిధిలోని చింతలపూడి గ్రామంలో ఏర్పాటు చేసిన గణనాథుల నిమజ్జనాలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. గ్రామంలో జనసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుని నిమజ్జన కార్యక్రమం కొలహాల వాతావరణంలో జరిగింది. నిమజ్జనం సందర్భంగా మండపం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కర్ర సాయి ప్రదర్శనతో గణనాథుడు ఊరేగింపు కార్యక్రమం సందడిగా సాగింది. ఈ నిమజ్జన కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

● చేబ్రోలు: వినాయక చవితి సందర్భంగా చేబ్రోలు ప్రధాన రహదారి వెంట ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మండపంలో పది రోజులుగా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం స్వామివారికి రూ.10లక్షల నూతన నోట్లతో వినాయకుడిని లక్ష్మీగణపతిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణనాథుడిని వీక్షించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

గణనాథునికి ఎమ్మెల్యే నరేంద్ర పూజలు

చేబ్రోలు మండలంలోని చేబ్రోలు, మంచాల,గుండవరం గ్రామాల్లో వినాయకచవితి సందర్భంగా ఏర్పాటు చేసిన గణేష్ నవరాత్రుల ప్రత్యేక పూజల్లో పొన్నూరు శాసన సభ్యుడు ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ పాల్గొన్నారు. కార్యక్రమంలో చేబ్రోలు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు షైలా వెంకట రామరాజు తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మంగళగిరి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం మంగళగిరి, తాడేపల్లి పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని డీఈఈ జీ.సురేష్‌బాబు తెలిపారు. మంగళగిరి పట్టణంలో భగత్‌సింగ్ నగర్, పార్కు రోడ్డు, నిడమర్రు రోడ్డు, రైల్వే స్టేషన్ రోడ్డు, బ్యాంకు కాలనీ, గౌతమబుద్ధ రోడ్డు, నాంచారమ్మ చెరువు, తెనాలి రోడ్డు, పెదకోనేరు, హుస్సేన్‌కట్ట, మార్కెట్ సెంటరు, తాడేపల్లి పరిధిలో సీతానగరం బోటు యార్డు నుంచి ఆశ్రమం రోడ్డు, కేఎల్ రావు కాలనీ వరకు ఉదయం 8:30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

● తుళ్లూరు: మండల పరిధిలోని అనంతవరం సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మత్తులు, మెయింటెన్స్ ఉన్నందున నెక్కల్లు, అనంతవరం, పెదపరిమి గ్రామాలకు శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటలకు విద్యుత్ అంతరాయం ఉంటుందని రాయపూడి ఈఈ చికరాజు ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ

కాకుమాను, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా ముస్లింలు మిలాద్ ఉన్ నబీ పండుగను శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కాకుమాను, పాండ్రపాడు, రేటూరు, కొమ్మూరు, గరికపాడు, లింగంగుంటపాలెంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ద్విచక్ర వాహన దహనంపై కేసు నమోదు

పెదనందిపాడు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం ధ్వంసంపై స్థానిక పోలీసు స్టేషన్లో శుక్రవారం కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు మండల పరిధిలోని కొప్పర్రుకు చెందిన చింతా వసంతరావుకు చెందిన ద్విచక్ర వాహనాన్ని, పుల్లల వాముని గుర్తుతెలియని దుండుగులు పెట్రోల్ పోసి నిప్పంటించారు. ఒక్కసారిగా మంటలు వ్యాపించి పొగలు రావడంతో ఇంట్లో ఉన్న బాధితులు బయటకు వచ్చి చూడగా వాహనం కాలిపోగా, తలుపునకు మంటలు అంటుకోవడంతో చుట్టుపక్కల వారు నీటిని తెచ్చి మంటలను అదుపు చేశారు. ఆ సమయంలో భార్య, పెద్దకుమారుడు ఉన్నారు. దీనిపై ఏఎస్‌ఐ శివకుమార్ కేసు నమోదు చేయగా ఎస్‌ఐ మధుపవన్ దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు

విద్యుత్ ఏఈగా మురళీకృష్ణ

పెదనందిపాడు, సెప్టెంబరు, 5 (ఆంధ్రజ్యోతి): మండల విద్యుత్ ఏఈగా మురళీకృష్ణ నియమితులయ్యారు. పొన్నూరులో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ పదోన్నతిపై పెదనందిపాడు ఏఈగా నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేసింది.

సిట్ దర్యాప్తుపై సజ్జల వ్యాఖ్యలు హాస్యాస్పదం : కొల్లా

కాకుమాను, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): లిక్కర్ స్కాంపై సిట్ చేస్తున్న దర్యాప్తుపై సజ్జల రామకృష్ణారెడ్డి వ్యాఖ్యలు హాస్యాస్పదం అని సంగం డెయిరీ మాజీ చైర్మన్ కొల్లా వీరయ్య చౌదరి శుక్రవారం వ్యాఖ్యానించారు. సిట్‌పై సజ్జల రామకృష్ణారెడ్డి అవాకులు చవాకులు పేలడం సిగ్గుచేటన్నారు. లిక్కర్‌స్కాంలో సజ్జల కుటుంబం ప్రమేయం దర్యాప్తులో తేటతెల్లమవుతోందన్నారు.

ఆలీనగర్‌ను దుగ్గిరాల పంచాయతీలో కలపాలి

దుగ్గిరాల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాల పంచాయతీకి సమీపంలో ఉన్న ఆలీనగర్‌ను కొలకలూరు పంచాయతీ నుంచి దుగ్గిరాల పంచాయతీలో కలపాలని ముస్లింలు వేడుకుంటున్నారు. దశాబ్దాల కాలంగా ఆలీనగర్ వాసుల కష్టాలు తీరడం లేదని వాపోతున్నారు. ఆలీనగర్‌లోని 45 ఇళ్లు, ఏడు కిలోమీటర్ల దూరంలోని తెనాలి మండలం కొలకలూరు పంచాయతీ పరిధిలోని 13వ వార్డులో ఉన్నాయని తెలిపారు. నందివెలుగు వరకూ ఒక బస్సు, అక్కడి నుంచి మరో బస్సు ఎక్కి వెళితేగానీ కొలకలూరు వెళ్ళలేని పరిస్థితి ఉందన్నారు. సర్పంచ్ ఎన్నికల నాటికైనా ఆలీనగర్‌ను దుగ్గిరాల పంచాయతీలో కలుపుతూ జీవో జారీచేయాలని అధికారులకు విన్నవించారు.

జనతా వెల్ఫేర్ టీం ఆర్థికసాయం

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పట్టణంలోని నులకపేట జనతా వెల్ఫేర్ టీం ఆధ్వర్యంలో శుక్రవారం షేక్ ఇబ్రహీం, సలీమ, మల్లాది వెంకటరామశర్మ, లక్ష్మిల కుటుంబాలకు ఆర్థిక సాయంతో పాటు నిత్యావసరాలను అందజేశారు. ఎంటీఎంసీ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు వీటిని పంపిణీ చేశారు.

నేడు నిరసన కార్యక్రమం

పెదనందిపాడు, సెప్టెంబరు, 5 (ఆంధ్రజ్యోతి): భారత్‌పై అమెరికా విధిస్తున్న టారిఫ్‌లకు వ్యతిరేకంగా వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10గంటలకు పాతబస్టాండ్ సెంటర్లో నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు సీపీఎం పార్టీ మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్‌బాబు శుక్రవారం తెలిపారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నేతలు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

కార్మిక ప్రదర్శనను జయప్రదం చేయాలి: రవి

మంగళగిరి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ అఖిల భారత 18వ మహాసభలు డిసెంబరు 31 నుంచి జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో జరుగనున్నాయని సీఐటీయూ రాజధాని డివిజన్ అధ్యక్షుడు ఎం.రవి తెలిపారు. మహాసభల్లో భాగంగా 4న విశాఖపట్నంలో జరిగే కార్మిక ప్రదర్శనకు రాజధాని ప్రాంతం నుంచి కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. మంగళగిరి మండలం ఎర్రబాలెం, నవులూరు, బేతపూడి, నిడమర్రు మునిసిపల్ కార్మికుల విస్తృత సమావేశం శుక్రవారం జరిగింది. సమావేశంలో మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నేతలు టీ.బాబు, ఓ.రామారావు, టీ.ఆదిలక్ష్మీ, శివనాగేంద్రం, కనకమ్మ, రజని, కే.కోటేశ్వరి, ఎన్.దివ్య తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా కోవెలమూడి మేజరు


కోవెలమూడి మేజరులో ఉన్న గుర్రపు డెక్క, జమ్ము

● గుర్రపు డెక్క, జమ్ముతో పారని నీరు
● ఇక్కట్లుపడుతున్న రైతులు

వట్టిచెరుకూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కోవెలమూడి మేజరు కాలువకు సాగునీరు అందని ద్రాక్షగా మారింది. సాగునీరు అందక ఎండిపోతున్న వరితో వెదసాగు రైతులు గగ్గోలు పెడుతున్నారు. గుంటూరు చానల్ నుంచి రూరల్ మండలం బుడంపాడు, చేబ్రోలు మండలంలోని గొడవర్రు గ్రామ సమీపంలో చీలి 11 కిలోమీటర్ల వరకు సాగునీరు, తాగునీరు అందించే కోవెలమూడి చానల్ దుస్థితిపై రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్‌కు ముందే కాల్వల మరమ్మతులు చేపట్టాల్సిన అధికారులు, నూతనంగా ఏర్పడిన సాగునీటి సంఘం సభ్యులు ఎవరికివారు పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుతం కోవెలమూడి మేజరు కాలువ నుంచి బుడంపాడు ఆయకట్టు, గొడవర్రు గ్రామం సమీపంలోని గుండవరం, ఆర్అండ్‌బీ రోడ్డు దాటి చుక్క నీరు కూడా ప్రవహించటం లేదు. ఖరీఫ్ సాగు ప్రారంభమయ్యాక మూడు దఫాలుగా భారీవర్షాల కారణంగా వచ్చిన వరదలతో వెదసాగు మూడు వంతులు దెబ్బతింది. మిగిలిన వెదసాగుతో పాటు పలు ప్రాంతాల నుంచి తెచ్చిన వరి నారును నాటేందుకు నీటి లభ్యత లేక రైతులు తలలు పట్టుకుంటున్నారు. తక్షణం కాలువల్లో గుర్రపు డెక్క, జమ్మును తొలగించి సాగునీరు అందించాలని రైతులు కోరుతున్నారు.

వైభవంగా వినాయక నిమజ్జనాలు

తాడేపల్లి (గుండిమెడ), సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎంటీఎంసీ పరిధిలోని కొలనుకొండలో టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు కొమ్మారెడ్డి కిరణ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణనాథుని శుక్రవారం గుండిమెడలో ఊరేగించి నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన లడ్డూ వేలంలో ఐదు కేజీల లడ్డూను కొమ్మారెడ్డి వెంకటేశ్వరరావు, బుజ్జి రూ.77,777కు పాడుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలీయ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, స్వచ్ఛాంధ్ర డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆరుద్ర భూలక్ష్మి, తెలుగు రైతు గుంటూరు జిల్లా అధ్యక్షుడు కళ్లం రాజశేఖర్‌రెడ్డి, గ్రామ టీడీపీ అధ్యక్షుడు చిగురుపాటి సుబ్బారావు, పెనుమాక, ఇప్పటం పీఏసీఎస్ చైర్మన్‌లు కళ్లం గోవిందరెడ్డి, పోకల బాపయ్య, టీడీపీ నేతలు కాట్రగడ్డ మధుసూదనరావు, కొల్లి సురేష్, కాసరగడ్డ శ్రీనివాసరావు పాల్గొన్నారు.


ప్రత్తిపాడులో చౌదరి యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక నిమజ్జన ఊరేగింపు


కొలనుకొండలో కొమ్మారెడ్డి కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన గణనాథుని ఊరేగింపు


కాట్రపాడులో గణనాథునికి రూ.17లక్షలతో చేసిన అలంకారం

● ప్రత్తిపాడు: స్థానిక చౌదరి బజారులో తెలుగు యువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని నిమజ్జన వేడుకలు ప్రత్తిపాడులో వైభవంగా నిర్వహించారు. తీన్‌మార్ డబ్బులు, మరోపక్క నృత్యాలతో కోలాహలంగా ఊరేగిం నిర్వహించారు.

● పెదనందిపాడు: మండలంలోని పలు గ్రామాల్లో గణపతి నవరాత్రి ఉత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. గోగులమూడి, పుసులూరు, పెదనందిపాడులో గణనాథుని విగ్రహాలను ట్రాక్టర్లపై గ్రామవీధుల్లో డప్పు వాయిద్యాలు, బాణసంచా నడుమ ఊరేగించి సూర్యలంక సముద్రతీరంలో నిమజ్జనం చేశారు.

కాట్రపాడులో రూ.17లక్షలతో అలంకారం

వట్టిచెరుకూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాట్రపాడులో తెలుగు యువత ఆధ్వర్యంలో వినాయక చవితి సందర్భంగా 17వ వార్షికోత్సవ గణనాథుని విగ్రహానికి శుక్రవారం రూ.17లక్షల నగదుతో శోభాయమానంగా అలంకరించారు.


వ్రతంలో పాల్గొన్న దంపతులు, విశేష అలంకారంలో భూ వరాహస్వామి

విజయకీలాద్రిపై వైభవంగా భూ వరాహ స్వామి వ్రతం

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): త్రిదండి చినశ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి మంగళశాసనాలతో సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై శుక్రవారం భూ వరాహస్వామి వ్రతం వైభవంగా జరిగింది. ఆశ్రమ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 150 జంటలతో వ్రతపూజ నిర్వహించామన్నారు. కార్యక్రమంలో అర్చకులు శ్రీనివాసాచార్యులు, అనంతస్వామి, వేద విద్యార్థులు, భక్తులు పాల్గొన్నారు.

నిడుముక్కల శివాలయంలో భాష్యం ప్రవీణ్ ప్రత్యేక పూజలు


నిడుముక్కల శివాలయంలో పూజలు చేస్తున్న పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

తాడికొండ (నిడుముక్కల) సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ శుక్రవారం తాడికొండ మండలం నిడుముక్కల గ్రామంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని శ్రీగంగా పార్వతీ సమేత సోమేశ్వరస్వామి దేవస్థానంలోని నందీశ్వరుడు, గంగా పార్వతీ సమేత సోమేశ్వరస్వామికి, నందీశ్వరుడికి పలు రకాల ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. అంతేకాకుండా గ్రామంలోని బోడ్డురాయి సెంటర్‌లో తెలుగుయువత అధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాన్ని సందర్శించి పూజా కార్యక్రమాలు చేపట్టారు.

కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు తలశిల ప్రసన్నకుమార్, యడ్లపల్లి సాంబశివరావు, చిగురుపాటి అనూప్, బండ్ల శ్రీకాంత్, గుంటుపల్లి మదుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం


అధ్యాపకులను సన్మానిస్తున్న వై.వీ.ఆంజనేయులు

తాడికొండ (లాం) సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఫార్మసీ విద్యలో ఉపాధ్యాయుల పాత్ర అపారమైనదని రాష్ట్ర ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ మద్దినేని సుధాకర్ అన్నారు. శుక్రవారం లాం చలపతి ఫార్మసీ కళాశాలలో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మొహాలీ నైపర్ విశ్రాంత డైరెక్టర్ ప్రొఫెసర్ కే.రఘురాం, పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఆర్.నాగరాజు, చలపతి విద్యా సంస్థల చైర్మన్ వై.వీ.ఆంజనేయులు, ప్రిన్సిపాల్ నాదెండ్ల రామారావు, సెక్రటరి వై.సుజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● తాడికొండ(లాం): జాతీయ ఉపాధ్యాయులు దినోత్సవం సందర్భంగా లాం చలపతి ఇంజనీరింగ్ కళాశాలలో వేడుకలను శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో చలపతి విద్యాసంస్థల సెక్రటరి వై.సుజిత్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్, కళాశాల డైరెక్టర్ డి.వినయ్‌కుమార్, డాక్టర్ ఏ.బాలజీ తదితరులు పాల్గొన్నారు.

● ప్రత్తిపాడు: రోటరీక్లబ్ ఆఫ్ పెదనందిపాడు ఆధ్వర్యంలో స్థానిక రెయిన్‌బో పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పాఠశాలలోని ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షుడు చిన్నం శ్రీనివాసరావు, రోటరీక్లబ్ సభ్యులు విక్టర్ జాన్‌పాల్, పాఠశాల డైరెక్టర్ నాగశ్రావణి, ప్రిన్సిపాల్ కృష్ణకుమారి పాల్గొన్నారు.

● మంగళగిరి: మంగళగిరి ఏపీఎస్పీ ఆరవ పటాలంలోని మునిసిపల్ పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తున్న కే.సైదానాయక్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. శుక్రవారం గుంటూరులో అవార్డును అందుకున్నారు.

● మంగళగిరి నియోజకవర్గ తెలుగునాడు ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు వల్లూరు నరసింహారావును గురుపూజోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. నరసింహారావును ఎంపీపీ కుషీబాయి, దుగ్గిరాల యార్డు చైర్మన్ ఉన్నం ఝాన్సీరాణి, సర్పంచ్ కుషీబాయి, టీడీపీ మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.


టీచర్ మాధవిని సత్కరిస్తున్న ఉప్పుటూరి చిన రాములు, మన్నవ శ్రీనివాసరావు

● దుగ్గిరాల: మండలంలోని పలుగ్రామాల్లోని పలు పాఠశాలల్లో గురుపూజోత్సవ వేడుకలు జరుపుకున్నారు. హెచ్ఎం శోభాదేవి, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులతో కలిసి, డాక్టర్ సర్వేపల్లి, శ్రీసరస్వతీదేవి విగ్రహాలకు పూలమాలలు వేశారు.

● కాకుమాను: మండలంలోని కొండపాటూరు జడ్పీహెచ్ఎస్‌లో హిందీ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న ప్రమీలాదేవి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును గుంటూరు అందుకున్నారు.

● తాడేపల్లి (వడ్డేశ్వరం): లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ మహానగర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని వడ్డేశ్వరం జడ్పీ హైస్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. 30మంది ఉపాధ్యాయులను లయన్స్ క్లబ్ పెద్దలు సత్కరించారు. కార్యక్రమానికి లయన్స్ ప్రెసిడెంట్ చిట్టూరి వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో రామకృష్ణ, హెచ్ఎం కాకుమాను జోజప్ప, చావా శ్రీనివాస్, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● వట్టిచెరుకూరు: మండలంలోని పుల్లడిగుంటలో ప్రైవేట్ టీచర్ మాదవిని ఉప్పుటూరి చిన రాములు, మన్నవ శ్రీనివాసరావులు సత్కరించారు. ఎన్ఆర్ఐ రామ్ చౌదరి రూ.25వేలు, మన్నవ శ్రీనివాసరావు రూ.5వేలు, ముత్తినేని శ్రీనివాసరావు రూ.5వేలు ఆమెకు అందజేశారు.

మంత్రి లోకేశ్ కృషితో పరుగులు పెడుతున్న అభివృద్ధి

● వల్లభనేని వెంకటరావు

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మంత్రి లోకేశ్ కృషితో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నాయని తాడేపల్లి పట్టణ టీడీపీ అధ్యక్షుడు వల్లభనేని వెంకటరావు పేర్కొన్నారు. శుక్రవారం తాడేపల్లి 17వ వార్డులోని రైల్వే కట్ట వద్ద వైసీపీ ప్రభుత్వంలో ఆగిపోయిన రజక కమ్యూనిటీ హాల్ పనులను టీడీపీ నాయకులు శుక్రవారం పునఃప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు దారా దాసు, జి.నాగేశ్వరరావు, ఉయ్యాల శ్రీనివాసరావు, దానబోయిన సుందరరావు యాదవ్, మేకా పుల్లారెడ్డి, ఓలేటి రాము తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామివారి కల్యాణోత్సవం

దుగ్గిరాల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం దుగ్గిరాల రైలుపేటలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి కల్యాణోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. భాద్రపదమాసం శ్రవణనక్షత్ర సందర్భంగా స్వామివారి ఆలయంలో ఉదయం స్వామివారి పలు రకాల అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు సాకేత్, రామచంద్రులు, వెలగా ప్రసాద్, కామేశ్వరి, కొత్త శ్రీచంద్ అనూరాధ, జంపాల లక్ష్మీనరసింహశివప్రసాద్, మంగాదేవి, ఈడ్పుగంటి కృష్ణకుమారి తదితర దంపతులు కల్యాణోత్సవం నిర్వహించారు. కొంగర సుధీర్‌కుమార్, వంకదార పణికుమార్‌తోపాటు, పలువురు ఆలయ నిర్వాహక కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సహకార సొసైటీని బలోపేతం చేస్తా

● ఫిరంగిపురం పీఏసీఎస్ చైర్మన్ రామకోటేశ్వరరావు


ఫిరంగిపురం నూతన పీఏసీఎస్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన కటికల రామకోటేశ్వరరావు

ఫిరంగిపురం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర సహకార పరపతి సొసైటీ ఫిరంగిపురం శాఖను బలోపేతం చేస్తామని నూతన పీఏసీఎస్ చైర్మన్ కటికల రామకోటేశ్వరరావు పదవీ స్వీకారం చేసిన ఆయన శుక్రవారం ఫిరంగిపురంలో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. రైతులకు సేవ చేసే సువర్ణ అవకాశాన్ని తాడికొండ శాసన సభ్యులు తెనాలి శ్రావణ్ కుమార్ మండల టీడీపీ నాయకుల సహకారంతో పొందానన్నారు. రైతులందరికీ అందుబాటులో ఉండి రైతుల శ్రేయస్సే ధ్యేయంగా పని చేస్తానన్నారు. కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మండవ నరసింహారావు, బత్తుల వేణుగోపాల్ బాబు, గొర్రెపాటి చంద్రశేఖర్, డీ జ్యోతి, నల్లజర్ల అప్పయ్య, షేక్ మహమ్మద్ యాకూబ్, ఆళ్ల కృష్ణమూర్తి, గోలి బాల జోజి తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం యువజన అధ్యక్షుడిగా మహేశ్

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా మంగళగిరికి చెందిన పారేపల్లి మహేశ్ నియమితులయ్యారు. మహేశ్ గుంటూరు జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. ఈ మేరకు మంగళగిరిలోని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు, మహేశ్‌కు నియామకపత్రం అందజేశారు. బీసీ సంక్షేమ సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు కుమ్మర క్రాంతికుమార్, కోశాధికారి కన్నా మాస్టారు, ఉద్యోగ విభాగం అధ్యక్షుడు మూర్తి, శివరాం బాబాజీ, కొల్లూరి హనుమంతరావు, గుంటుపల్లి ఉమామహేశ్వరరావు, కాగితాల స్వాతి, తిరువీదుల కిరణ్‌లు మహేశ్‌కు అభినందనలు తెలిపారు.

విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ

తాడేపల్లి (ఉండవల్లి), సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి రూరల్, పట్టణానికి చెందిన పలు ప్రభుత్వ పాఠశాలల్లోని 130మంది 8వ తరగతి విద్యార్థినులకు రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి, రోటరీక్లబ్ జుబ్లీహిల్స్ సంయుక్త సహకారంతో తాడేపల్లి రోటరీ క్లబ్ అధ్యక్షుడు శెట్టి రామకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేశారు. ఉండవల్లిలో రోటరీ ప్రతినిధుల సమావేశంలో ముఖ్య అతిథిగా డిస్ట్రిక్ట్ గవర్నర్ (3150) డాక్టర్ ఎస్వీ రామ్‌ప్రసాద్ సైకిళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ ఈదర పూర్ణచంద్రరావు, విసిరెడ్డి బాలకోటిరెడ్డి, తాళ్ళ రాజశేఖర్‌రెడ్డి, రవి వడ్లమాని, పంగులూరి కళ్యాణ్, విసిరెడ్డి లక్ష్మి, చక్రవర్తిరెడ్డి, ప్రగడ రాజశేఖర్, జెట్టి శ్రావణి, కె.వెంకటనగేష్, ఎం.వివేకానందరెడ్డి, రావూరి రమేష్‌బాబు, సుకుమార్ రెడ్డి,జి.నాగరాజేష్, కె.శివన్నారాయణ, రాజేష్, ఓబులారెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

రక్షిత మంచినీటి ట్యాంకు నిర్మాణానికి భూమిపూజ

దుగ్గిరాల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇంటింటికీ రక్షిత మంచినీటి పథకం కింద ఓవర్‌హెడ్‌ట్యాంకు నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. జల్‌జీవన్ మిషన్, ఆర్‌డబ్ల్యుఎస్ నిధులు రూ.4.07కోట్లతో ఓవర్‌హెడ్‌ట్యాంక్, ఫిల్టర్‌బెడ్ నిర్మాణం పనులు ఏడాదిలోగా పూర్తిచేయనున్నట్లు డీఈ ఏ రామకృష్ణారావు తెలిపారు. ఎంపీపీ షేక్ జబీన్, దుగ్గిరాలయార్డు చైర్మన్ ఉన్నం ఝాన్సీరాణి, సర్పంచ్ కుషీబాయి, టీడీపీ మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, గూడూరు వెంకట్రావు, పసుపులేటి శ్రీనివాసరావు, కొంగర జోగేంద్రప్రసాద్, వల్లూరు నరసింహారావు, మిక్కిలినేని గాంధీ, గద్దె శ్రీనివాస్, నక్కా చిరంజీవి, పఠాన్ జున్నూఖాన్, ఎండీ ఫిరోజ్, షేక్ బాషా, కాజా భాస్కరరావు, వెంకటేశ్వరనాయక్, డిప్యూటీ ఎంపీడీఓ జవహర్‌లాల్, ఈఓ వివేకానంద, ఏఈ వేణుగోపాల్ పాల్గొన్నారు.

శివాలయం కార్యవర్గం ప్రమాణస్వీకారం

మంగళగిరి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని బేతపూడిలో శ్రీగంగా పార్వతి సమేత సోమేశ్వరస్వామి దేవస్థానం పాలకవర్గ ప్రమాణస్వీకారం ఘనంగా జరిగింది. ట్రస్టుబోర్డు చైర్మన్‌గా వాసా శ్రీనివాసరావు, పదిమంది ప్రమాణస్వీకారం చేశారు. ఏపీ పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, స్వచ్ఛ ఆంధ్ర మిషన్ డైరెక్టర్ ఆరుద్ర భూలక్ష్మీ, మంగళగిరి మార్కెట్‌యార్డు వైస్‌చైర్మన్ యర్రగుంట్ల భాగ్యారావు, వాసా శ్రీనివాసరావు, గైరుబోయిన శ్రీనివాసరావు, అడపా నరసింహారావు, జూట్రు దుర్గారావు, రెడ్డి శ్రీనివాసరావు, బత్తుల వెంకటేశ్వరరావు,భానుశ్రీ, శివాజీ పాలకమండలి సభ్యులను అభినందించారు.

గ్రామ జీవనాడిని రక్షించుకోవాలి...

ఫిరంగిపురం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): గ్రామ జీవనాడి మంచినీటి చెరువును రక్షించుకోవాలని బాలఏసు కెథడ్రల్ చర్చి ఫాదర్ మాలపాటి పాతిమామర్రెడ్డి అన్నారు. శుక్రవారం ఫిరంగిపురం గ్రామానికి తాగునీరందించే కోనేటికి రక్షణ కంచె నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు మండవ నరసింహారావు, రామిశెట్టి జోజప్ప, మాథ్యూ లూయిస్, గోలి బాలజోజి, టీ హృదయరాజు, కటికల అప్పారావు, కొలగాని కొండలు, వడ్లమూడి రమేష్, పసల తోమాస్, ఈవో ఏ కిషోర్‌బాబు, కే రాములు పాల్గొన్నారు.

నిమజ్జనం ఊరేగింపునకు వెళ్లి వస్తూ వ్యక్తి దుర్మరణం

గుంటూరు సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): వినాయకుడి విగ్రహం నిమజ్జనానికి వెళ్లి వస్తూ ప్రత్తిపాడు మండలం చినకొండ్రుపాడుకు చెందిన చల్లా రాంబాబు రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. రాంబాబు గుంటూరు ఆదర్శనగర్‌లో ఉంటున్నాడు. ఈ నెల 4న రాత్రి వినాయకుడి ఊరేగింపు ముగించుకుని శుక్రవారం తెల్లవారుజామున స్కూటీపై గుంటూరు బయలుదేరాడు. కొత్తూరు సమీపంలో వెనుకనుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టగా రాంబాబు అక్కడే మృతి చెందాడు. మృతుడు తండ్రి చల్ల పెద్దశ్రీను ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.